




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 231, పేజీలు - 08

గురువారం, ఫిబ్రవరి 5, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## మున్సిపల్ ప్రచారానికి

# కాంగ్రెస్, బీజేపీ తరపున అగ్రనేతలు

### - బీఆర్ఎస్ లైట్ తీసుకుందా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అగ్రనేతలను రంగంలోకి దించగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రం స్థానిక నేతలకే బాధ్యత వదిలేసింది. తెలంగాణలోని 123 మున్సిపల్, 7 కార్పొరేషన్లకు జరుగుతున్న ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ తన పాలనకు ఒక రెఫరెండంగా భావిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల్లో పర్యటిస్తూ ప్రచారాన్ని హోరెత్తించాలని నిర్ణయించారు. పట్టణ ఓటర్లను ఆకట్టుకునేందుకు వరాల జల్లు కురిపిస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా తన పట్టును నిరూపించుకోవాలని చూస్తున్నారు. కేడర్‌లో ఉత్సాహం నింపేలా ప్రతి మున్సిపాలిటీకి మంత్రులను ఇన్-ఛార్జులుగా నియమించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

**- ప్రచారానికి వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు**

బీజేపీ సైతం ఏమాత్రం తగ్గడం లేదు. జాతీయ అధ్యక్షుడు స్వయంగా

2లో..

## మోదీని చుట్టుముట్టిన

# మహిళా ఎంపీలు

**- లోక్‌సభలో గందరగోళం, ప్రధాని ప్రసంగం రద్దు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం రద్దు కావడానికి దారితీసిన లోక్‌సభలోని గందరగోళం బుధవారం ఉదయమే ప్రారంభమైంది. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే ఆత్మకథలోని కొన్ని అంశాలను ప్రస్తావించడానికి

2లో..

## కేసీఆర్.. నువ్వేలా

# జాతిపిత అవుతావు.?

**- నల్లగొండలో రేవంత్ సంచలన వ్యాఖ్యలు**

- పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు
- మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం
- బీఆర్ఎస్ నాయకులు దోపిడీదారులు అంటూ విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)నల్లగొండ వేదికగా బుధవారం జరిగిన విజయభేరి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ , ఆయన కుటుంబంపై నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజలకు చేసిన అన్యాయానికి బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాల్సింది పోయి, సిగ్గు లేకుండా మాట్లాడుతోందని మండిపడ్డారు. కేసీఆర్‌కు నోటీసులు

2లో..

### ఇంతకు మించిన ఆధారాలు

## ఇంకేముంటాయి.?

**- స్పీకర్ తీరుపై కవిత ఆగ్రహం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికే

2లో..

## మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా

# వెనుకబడిన వర్గాలు

**- కార్యాచరణ సిద్ధం చేయాలన్న సీఎం చంద్రబాబు**

- ఆదరణ-3 ద్వారా కులవృత్తులకు ఆధునిక పరికరాల పంపిణీకి చర్యలు
- రూ.60 కోట్ల సాస్కీ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం
- బీసీ హాస్టళ్లలో మార్చిలోగా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం



అమరావతి (ప్రశ్న న్యూస్) వెనుకబడిన వర్గాలను (బీసీ) కేవలం సంక్షేమ లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా (మైక్రో ఎంట్రప్రెన్యూర్లు), ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కులవృత్తుల వారికి ఆధునిక సాంకేతికతను అందించే లక్ష్యంతో 'ఆదరణ-3' పథకం ద్వారా ఆధునిక పనిముట్లను పంపిణీ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యా రంగంలో బీసీ విద్యార్థులకు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడంపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.60 కోట్ల సాస్కీ నిధులతో

2లో..

# అంబటిని పొగడాల్సిందిపోయి అరెస్టు చేయడమేంటీ.?

**- చంద్రబాబును ప్రశ్నించిన జగన్**

- మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన జగన్
- రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోందని ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం
- మూడేళ్లలో తిరిగి అధికారంలోకి వస్తామని కూటమికి ఘాటు హెచ్చరిక



అమరావతి (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి చంద్రబాబును బూతులు తిట్టి అరెస్టు అయ్యి జైల్లో ఉన్న మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ నేత అంబటి రాంబాబు ఫ్యామిలీని వైఎస్ఆర్‌సీపీ అధినేత పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన జగన్, అంబటి చేసిన పనికి క్షమాపణలు చెప్పారని అలాంటి వ్యక్తిని పొగడాల్సిందని అన్నారు. కానీ దుర్మార్గమైన ప్రభుత్వం అరెస్టు జైల్లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లకాలం ఈ ప్రభుత్వం అధికారంలో ఉండదని మూడేళ్ల తర్వాత తమ ప్రభుత్వం వస్తుందని కచ్చితంగా వడ్డీతో పోలీసులకు, రాజకీయా నాయకులకు బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి ర్యాలీగా గుంటూరులోని అంబటి రాంబాబు ఇంటికి వెళ్లారు. అంబటి రాంబాబు కుటుంబాన్ని కలిశారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. టీడీపీ శ్రేణుల దాడుల్లో ధ్వంసమైన ప్రాంతాలను పరిశీలించారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జంగిల్ రాజ్ పాలన నడుస్తోందని ఆరోపించారు.

2లో..

# రేవంత్ బినామీ బాగోతం కప్పిపుచ్చేనందుకే సిట్ విచారణ డ్రామా

**- మీడియాతో సమావేశంలో కేటీఆర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సీఎం రేవంత్ రెడ్డికి చెందిన బినామీ కంపెనీ బాగోతం, ఆయన చేసిన ఫ్రాడ్ ప్రజలకు తెలియకుండా దాచిపెట్టడానికి బీఆర్ఎస్ నేతలకు వరుస నోటీసులు ఇచ్చారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీబీఐ దర్యాప్తునకు ఎన్సీఎల్టీ ఆదేశించిన కేఎల్ఎస్ఆర్ కంపెనీకి తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు ఎందుకు ఇచ్చిందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అక్రమ సంపాదన కోసమా, లేక బినామీ కంపెనీకి ప్రాజెక్టుల కోసమా, కమీషన్ల కోసమా అని కేటీఆర్ నిలదీశారు. దీనిమీద సీబీఐ, ఈడీ రంగంలోకి దిగి విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. న్యాయమూర్తిని సైతం ప్రలోభపెట్టాలని చూశారని పేర్కొన్నారు. బినామీ కంపెనీ కాకపోతే నిషేధం ఉన్న కంపెనీకి రేవంత్ రెడ్డి ప్రాజెక్టులు ఎలా కట్టబెట్టారని, ఆయన పాత్ర ఏంటో తేలాలన్నారు.

**- రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్కాంలను అడ్డుకున్నది బీఆర్ఎస్**

తెలంగాణ భవన్‌లో బుధవారం నాడు కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ అంటూ సంచలన ఆరోపణలు చేశారు. 'మూసీ అభివద్ధి పేరుతో 1.5 లక్షల కోట్ల దోపిడీని అడ్డుకున్నది బీఆర్ఎస్, లగచర్లలో తన సొంత అల్లుడి కంపెనీ కోసం ఫార్మా సిటీ పేరుతో గిరిజనుల మీద దాడి చేస్తే స్కాంను బయటపెట్టింది తామేనన్నారు. హెచ్ఐఎల్‌టీ పేరుతో రూ.5 లక్షల కోట్ల భూ భాగోతాన్ని బయటపెట్టాం, సీఎం రేవంత్ రెడ్డి బావమరిది అమృత్ లో చేసిన స్కాంను బయటపెట్టాం. ఇటీవల సింగరేణి బొగ్గుగణుల్లో

2లో..

## దేశ సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను

# కేంద్రంగా మారుస్తాం

**- సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు గద్దర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశవ్యాప్తంగా ఉన్న సినీ పరిశ్రమకు హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలుగు సినీ పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి

2లో..

# నా జోలికి వస్తే నీ బతుకును రోడ్డుకీడుస్తా

**- కేటీఆర్ కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన బండి సంజయ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను, నాడు మంత్రిగా ఉన్నప్పుడు కేటీఆర్ పక్కదోవ పట్టించారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. నిధులను పక్కదారి పట్టించి వరదల్లో సిరిసిల్ల మునిగేలా చేశారని విమర్శించారు. సిరిసిల్లను కేటీఆర్ నాశనం చేశారని అన్నారు. వరదలు వస్తే సిరిసిల్లలో పలు కాలనీలు నీట మునుగుతాయని కలెక్టరేట్ కూడా మునిగి, జిల్లా కలెక్టర్ ట్రాక్టర్ లో రావాల్సిన పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న కేటీఆర్ తనపై వేల కేసులు పెట్టించారని బండి సంజయ్ మండిపడ్డారు. ఇప్పుడు కోర్టుల నుంచి నోటీసులు పంపిస్తున్నారని దుయ్యబట్టారు. నా జోలికి వస్తే నీ బతుకును రోడ్డుకీడుస్తా అని హెచ్చరించారు. నీ అరాచకాలు, నీ నీచ పనులు బయటపెడతానని అన్నారు. తనకు భయపడి సిరిసిల్లలోనే కేటీఆర్ మకాం వేశారని ఎద్దేవా చేశారు. ఓటుకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో బలవంతంగా ఏడు గ్రామాలను కలిపి, అక్కడి పేదలకు ఉపాధి హామీ పనులు లేకుండా చేశారని మండిపడ్డారు. సిరిసిల్లకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల వివరాలను కేటీఆర్ సహా అందరికీ పంపిస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను

2లో..

# చంద్రబాబు, పవన్ సుదీర్ఘ సమావేశం

**- వైసీపీ కుట్రలు, కూటమి సమన్వయంపై ప్రధానంగా చర్చ**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య అమరావతిలో జరిగిన కీలక భేటీ ముగిసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు

2లో..

# మున్సిపల్ ప్రచారానికి
## కాంగ్రెస్, బీజేపీ తరపున అగ్రనేతలు

ప్రచారానికి వస్తుండటమే కాకుండా, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి వారు గల్లీ గల్లీ తిరుగుతున్నారు. వీటికి అదనంగా, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండు రోజుల పాటు తెలంగాణలో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనుండటం ఆ పార్టీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. జనసేన మద్దతుతో సెటిలర్ల ఓట్లను, యువత ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టాలన్నది బీజేపీ వ్యూహం. ఇంతటి భారీ యంత్రాంగాన్ని దింపడం ద్వారా రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయం అనే సంకేతాన్ని ఆ పార్టీ పంపిస్తోంది.

**- జాతీయ పార్టీల హడావుడిని పట్టించుకోని బీఆర్ఎస్**

ఈ హడావుడి మధ్య బీఆర్ఎస్ తీరు రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ప్రతి చిన్న ఎన్నికనూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులు ఈసారి ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమవుతూ, క్షేత్రస్థాయి ప్రచార బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్-ఛార్జులకే వదిలేశారు. అభ్యర్థుల ఎంపిక కూడా వారికే ఇచ్చారు. దీనివల్ల పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన స్తబ్దత నెలకొంది.

**- ఫలితాలు తేడా వస్తే బాధ్యత తీసుకోకుండానేనా.?**

బీఆర్ఎస్ ఈ ఎన్నికలను లైట్ తీసుకోవడం వెనుక లోతైన రాజకీయ కారణాలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఎన్నికల్లో ఫలితాలు తారుమారైతే, ఆ ఓటమి బాధ్యతను తమపై వేసుకోకుండా తప్పించుకోవడానికే అగ్రనేతలు దూరంగా ఉంటున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించడం ద్వారా ఫలితాలు బాగుంటే పార్టీ పుంజుకుందన్న ప్రచారం, తేడా వస్తే స్థానిక నేతల వైఫల్యంగా చూపించే వీలుంటుందని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇది కార్యకర్తలను నిరుత్సాహానికి గురిచేస్తోంది. కాంగ్రెస్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, బీజేపీ తన బలాన్ని నిరూపించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతుంటే బీఆర్ఎస్ మాత్రం డిఫెన్సివ్ మోడ్‌లో కనిపిస్తోంది.

# మోదీని చుట్టుముట్టిన మహిళా ఎంపీలు

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడంతో ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. పలుసార్లు వాయిదాల అనంతరం సాయంత్రం 5 గంటలకు మళ్లీ సభ ప్రారంభమైంది. ఈ సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తారని భావిస్తున్న కొద్దిసేపటి ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. వర్షా గైక్వాడ్, జ్యోతిమణి సహా ప్రతిపక్షానికి చెందిన కొందరు మహిళా ఎంపీలు ప్రధాని మోదీతో పాటు అధికార పార్టీ సభ్యుల సీట్లను చుట్టుముట్టారు.'డూ వాట్ ఈజ్ రైట్' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. మంగళవారం ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వారు నిరసనకు దిగారు. ఇది సభలో గందరగోళానికి దారితీయడంతో ప్యానెల్ స్పీకర్‌గా ఉన్న సంధ్య రాయ్ వాయిదా వేశారు. తమ సీట్ల నుంచి వెళ్ళిపోవాలని పలువురు మంత్రులు కోరిన తర్వాతే ఆ మహిళా ఎంపీలు తమ నిరసన ముగించారు. అయితే, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష మహిళా ఎంపీలు దాడిచేయాలని భావించారని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ ఆరోపించారు.'సభలో ఈ రోజు ఏదైతే జరిగిందో అది తీవ్ర భయానకమైంది, ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ నిస్సహాయత స్థాయిని మాత్రమే చూపుతుంది, పక్కా ప్రణాళికతోనే మహిళా ఎంపీలు ప్రదాని నరేంద్ర మోదీ సీటును చుట్టుముట్టారు కిరణ్ రిజిజు తక్షణమే జోక్యం చేసుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది' అని ఆయన తెలిపారు. వాయిదాల తర్వాత సభ మధ్యాహ్నం ప్రారంభం కాగానే.. 2020లో చైనాతో సరిహద్దుల్లో జరిగిన ప్రతిష్టంభన అంశంపై ప్రతిపక్ష సభ్యులు లేచి నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ గందరగోళం మధ్య సభను మళ్లీ వాయిదా వేయాల్సి వచ్చింది. అనంతరం ప్రధానమంత్రి ప్రసంగం రద్దయ్యింది. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి లోకసభ ఇంకా ఆమోదం తెలపలేదు. సభను నేటి వరకు వాయిదా వేశారు, కాబట్టి చర్చ కొనసాగే అవకాశం ఉంది.

# కేసీఆర్.. నువ్వెలా జాతిపిత అవుతావు.?

ఇస్తే అది తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లుగా చిత్రీకరించడాన్ని రేవంత్ తప్పుబట్టారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే తెలంగాణకు ఇచ్చినట్లా అలా అయితే ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్‌లలో ఉన్న మీ ఫామ్‌హౌస్‌లు, మీ టీవీ ఛానళ్లు, పేపర్లను ముందుగా ప్రజలకు అప్పగించండి అంటూ ముఖ్యమంత్రి సవాల్ విసిరారు.తెలంగాణ జాతిపిత అంశంపై కేసీఆర్ కుటుంబం చేస్తున్న ప్రచారాన్ని రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను జాతిపితగా పిలుచుకుంటామని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని తెలంగాణ తల్లి గా గౌరవించుకుంటామని స్పష్టం చేశారు. అసలు ఏ ప్రాతిపదికన మిమ్మల్ని మీరు జాతిపితగా పిలుచుకుంటున్నారు అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడి, భార్యాభర్తల మధ్య జరిగే ప్రైవేట్ సంభాషణలను కూడా విన్న మీకు జాతిపిత అని పిలిపించుకునే నైతిక హక్కు లేదని, ఈ పనులకు మీరు సిగ్గుపడాలని ఘాటుగా విమర్శించారు.రాజకీయాల్లో ఎవరూ చట్టానికి అతీతులు కారని, కేటీఆర్, హరీశ్ రావులపై జరుగుతున్న విచారణల గురించి రేవంత్ ప్రస్తావించారు. పోలీసులు ఎవరినైనా విచారణకు పిలిచినప్పుడు సామాన్యులకు ఎలాంటి కఠిన నిబంధనలు వర్తిస్తాయో, వీరికి కూడా అవే వర్తించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే నిందితుల ముఖాలకు ముసుగులు వేసి తీసుకువెళ్లే ప్రోటోకాల్‌ను కూడా అమలు చేయాలని కానీ పోలీసులు మంచోళ్లన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ఎవరూ కూడా తాము ప్రత్యేకం అని భావించకూడదని హితవు పలికారు. నల్లగొండ జిల్లా అభివృద్ధిపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, గత పాలకులు పెండింగ్‌లో పెట్టిన ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కేసీఆర్ అహంకారం వల్లే బీఆర్ఎస్ పతనమైందని, ఇప్పటికైనా ప్రజల పక్షాన నిలబడటం నేర్చుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# ఇంతకు మించిన
## ఆధారాలు ఇంకేముంటాయి.?

గొడ్డలిపెట్టు అని ఆమె వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ తరపున గెలిచిన ఎమ్మెల్యే, గాంధీ భవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొంటే అది పార్టీ ఫిరాయించినట్టు కాదా? అని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఇంతకంటే బలమైన ఆధారాలు ఇంకేం కావాలని కవిత స్పీకర్‌ను నిలదీశారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ బీ-ఫారాలను సదరు ఎమ్మెల్యేనే పంపిణీ చేసిన విషయం అందరికీ తెలిసిందేనని, ఆ విషయం స్పీకర్ దృష్టికి రాలేదా? అని ఆమె అన్నారు. ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను కొట్టివేయడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. "రాజ్యాంగబద్ధమైన స్పీకర్ స్థానంలో ఉండి మీరు కాంగ్రెస్ పార్టీ నాయకుడిలా వ్యవహరిస్తున్నారని అనుకోవాలా? అదే నిజమైతే భారత రాజ్యాంగాన్ని, చట్టసభల ఔన్నత్యాన్ని మీరు ఎలా కాపాడగలుగుతారు?" అంటూ కవిత స్పీకర్ తీరును తప్పుబట్టారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో స్పందించారు.

## మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా
# వెనుకబడిన వర్గాలు

కొత్తగా బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉన్న 814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హాస్టళ్లలో పారిశుధ్యం, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని, అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యం, విద్యాబోధన వంటి అన్ని అంశాల్లోనూ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అనుసరించాలని సూచించారు. విద్యార్థుల విద్యాపరమైన పురోగతిని పర్యవేక్షించేందుకు వీలుగా అపార్ ఐడీలను నమోదు చేసి, అనుసంధానం చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవనాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరుతో నడుస్తున్న 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలల స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఒక బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. బీసీ స్టడీ సర్కిళ్లను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని, కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వారికి ప్రయోజనం చేకూరేలా పథకాలు రూపొందించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## అంబటిని పొగడాల్సిందిపోయి
# అరెస్టు చేయడమేంటీ.?

ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారని భయానక వాతావరణం సృష్టిస్తున్నారని అన్నారు. తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని దుష్ప్రచారం చేశారని దాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ తప్పని తేల్చిందన్నారు. కొద్ది రోజులుగా చేస్తున్న ప్రచారాన్ని కమిటీ రిపోర్టుతో తిప్పికొట్టిందన్నారు. తమకు క్లీన్‌చిట్ ఇచ్చిందని వివరించారు. అయినా సరే తమ తప్పుడు ప్రచారాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ ఆపడం లేదన్నారు. తప్పుడు ప్రచారంతో ఎలాంటి అనుమతులు లేకుండానే ఫ్లెక్సీలు వేశారని జగన్ మండిపడ్డారు. దీన్ని ప్రశ్నించినందుకు తమ నేతలను టార్గెట్ చేసుకున్నారని అన్నారు. అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడు ఇలా అందరిపై కూడా దాడులు చేశారని, అంతే కాకుండా వారిపైనే కేసులు పెట్టి బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదంతా జంగిల్ రాజ్ పాలన కాదా అని నిలదీశారు.గుడికి వెళ్లి వస్తున్న అంబటి రాంబాబును టీడీపీ గూండాలు అడ్డుకున్నారని దాడికి యత్నించారని జగన్ వివరించారు. ం

వారు తిడుతున్న తిట్లకు కోపంతో నాలుగు మాటలు అన్నాడని తెలిపారు. పోలీసుల సమక్షంలోనే వారు బెరితెగిస్తుంటే ఎవరికైనా కోపం వస్తుందని అలానే అంబటి రాంబాబుకు కోపం వచ్చిందని వివరించారు. ఎలాంటి ఘర్షణ లేకుండానే చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ బూతులు తిడుతుంటారని వాటికి ఏం చేయాలని జగన్ ప్రశ్నించారు. ఆవేశంలో బూతులు తిట్టిన రాంబాబు తర్వాత వచ్చి తను అలా తిట్టకుండా ఉండాల్సిందని, మీడియా ముఖంగానే క్షమాపణ కూడా చెప్పారని జగన్ గుర్తు చేశారు. అయినా వాటిని పట్టించుకోకుండా టీడీపీ ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త, రౌడీలతో రాంబాబు ఇంటిపైకి దాడికి వచ్చారని అన్నారు. దీన్ని పోలీసులు చూస్తూ ఉండిపోయారని తెలిపారు. ఇంటిలో అన్నింటిని ధ్వంసం చేశారని, ఆడవాళ్లు ఉన్న సంగతి మర్చిపోయి విచక్షణరహితంగా ప్రవర్తించారని అన్నారు.

ఇంతలో రాంబాబుపై కేసులు పెట్టి ఆయన్ని అన్యాయంగా అరెస్టు చేశారని జగన్ వాపోయారు. పోలీస్ స్టేషన్‌లో చిత్రవధ చేశారని మండిపడ్డారు. క్షమాపణలు చెప్పిన రాంబాబును పొగడాల్సింది పోయి అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఆయన్ని బూతులు తిట్టిన ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్తపై బెయిలబుల్ కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఇదెక్కడి న్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ప్రభుత్వ ఎల్ల కాలం ఉండనది జగన్ గుర్తు చేశారు. కళ్లు మూసుకొని తెరిచే లోపు రెండేళ్లు గడిచిపోయాయని, ఇప్పుడు అలానే మూడేళ్లు గడిచిపోతాయని జగన్ అన్నారు. ఆ తర్వాత తమ ప్రభుత్వం వస్తుందని ఈ కుట్రలో భాగమైన పోలీసు అధికారులను, రాజకీయ నాయకులను వెంటాడతామన్నారు. అందరికీ కచ్చితంగా వడ్డీతో చెల్లిస్తామని హెచ్చరించారు. ఎవర్నీ వదిలిపెట్టేదేలేదని వార్నింగ్ ఇచ్చారు.

# రేవంత్ బినామీ బాగోతం
## కప్పిపుచ్చేనందుకే సిట్ విచారణ డ్రామా

కాంగ్రెస్ మోసాలను బయటపెట్టింది బీఆర్ఎస్ పార్టీ అని కేటీఆర్ అన్నారు. ఇలాంటి స్కాంలు, కుంభకోణాలు బయటపెడుతున్నందున జనవరి 22, 23 తరువాత మొదట హరీష్ రావు, తరువాత నాకు, సంతోష్ కుమార్, పార్టీ అధినేత కేసీఆర్ కు వరుస నోటీసులు ఇచ్చి సిట్ విచారణకు పిలవడంతో మాకు అనుమానం వచ్చింది. అన్ని విషయాలు గమనిస్తే సీఎం రేవంత్ రెడ్డి బినామా బాగోతం బయటపడింది.

**- సుప్రీంకోర్టు ఆదేశాలతో విషయం బయటకు**

జనవరి 23న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా అనేది రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ. మాతో ఆధారాలున్నాయి. దివాళా తీసిన కంపెనీ ఐపీ ప్రొఫెషనల్స్ లేకుండా రూ.6 వేల కోట్ల పనులకు కాంట్రాక్టులు ఎలా వచ్చాయని చూస్తే తెలంగాణలో వచ్చాయి. ఆయన చీఫ్ మినిస్టర్ కాదు, బినామీ చీఫ్ మినిస్టర్ అని అందరికీ తెలుసు. ఈరోజు ఆయన బినామీ మాస్టర్ అని తేలిపోయింది. బ్లాక్ మెయిల్ చేసి గతంలో సంపాదించిన డబ్బును ఆయన బినామీ కంపెనీలకు తరలిస్తున్నాడు. వేల కోట్ల ప్రాజెక్టులను కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ సహా పలు ప్రాజెక్టులు కట్టబెట్టారు. 2018 సెప్టెంబర్ 27న రేవంత్ రెడ్డి, ఆయన బంధువుల మీద ఐటీ రైడ్స్ జరిగాయి. ఆయన బావమరిది కంపెనీ సాయి మౌర్య ఎస్టేట్స్ వాళ్లు ట్యాక్స్ సరిగ్గా కట్టలేదని ఐటీ తెలిపింది. కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ రేవంత్ దని ఇది ఒక ప్రూఫ్. రేవంత్ రెడ్డి తిరుగుతున్న ల్యాండ్ క్రూజర్ కార్ నెంబర్ టీఎస్ శ్రీ7 ఎఫ్ఎఫ్ 0009 ఇది కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా టెక్ కంపెనీ పేరిట రిజిస్టర్ అయింది. రేవంత్ కు కారు ఎందుకు కొనిచ్చారంటే వాళ్లు రియల్ ఎస్టేట్, ఇతర లావాదేవీలు చేస్తున్నారు.

**- జడ్జిని ప్రలోభపెట్టాలని చూసిన కంపెనీ..**

2023 జులైలో కేఎల్ఎస్ఆర్, మరో కంపెని (ఏఎస్ ఎన్విటి)కి గొడవ జరగడంతో ఎన్‌సీఏటీని ఆశ్రయించారు. రేవంత్ రెడ్డికి ఉన్న బుద్ధులే ఈ కంపెనీకి ఉన్నాయి. ఎన్సీఎల్ఏటీ జడ్జి శరత్ కుమార్ తనకు ఫోన్లో మెస్సేజ్ వచ్చిందని, కేఎల్ఎస్ఆర్ కంపెనీకి మద్దతుగా తీర్పు ఇవ్వాలని మెస్సేజ్ రావడంతో ఒత్తిడి తట్టుకోలేక తప్పుకున్నారు.

ఆ బినామీ కంపెనీకి రేవంత్ రెడ్డి అండ ఉంది. బనామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ కంపెనీ నుంచి సాయి మౌర్య డెవలపర్స్ లోకి డబ్బులు పెట్టి, భూములు కొని లాభాలు తెచ్చే పనిని భూపాల్ ఇన్ ఫ్రా చూసుకుంటుంది. 2018లోనే రేవంత్ రెడ్డికి బినామీ కంపెనీఅని ఐటీ కంపెనీ రైడ్స్ ద్వారా బయటకొచ్చింది. రేవంత్ సీఎం కాగానే కేఎల్ఎస్ఆర్ కంపెనీకి పెద్ద ఎత్తున ప్రాజెక్టులు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, జల్ జీవన్ అమృత్ స్కీం కింద 6 వేల కోట్లకు పైగా ప్రాజెక్టులు వచ్చాయి.

**- దివాళా కంపెనీకి ప్రాజెక్టులు ఎలా ఇచ్చారు..**

మెదక్ లో ఆర్ అండ్ బీకి 111 కోట్లు, షాద్ నగర్, పరిగి రోడ్డు 135 కోట్లు, సూర్యపేట మోతే లిఫ్ట్ ఇరిగేషన్ కు రూ.1910 కోట్లు, రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ కోదాడకు 300 కోట్లు, కొడంగల్ లో వెటర్నరీ కాలేజీకి రూ.145 కోట్లు, మిషన్ భగీరథలో 160 కోట్లు ఇలా దాదాపు 6 వేల కోట్లు కేఎల్ఎస్ఆర్ కంపెనీకి ప్రాజెక్టులు వచ్చాయి. అయితే 2023లో కంపెనీ దివాళా తీసింది. దానిపై పిటిషన్ సైతం ఎన్సీఎల్టీలో నడుస్తోంది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక అప్పులు తీసుకున్న కేఎల్ఎస్ఆర్ కంపెనీకి రూ.6వేల కోట్లు వచ్చాయంటే ఏ విధంగా నిధులు వచ్చాయో తెలుస్తుంది. ఆర్థిక లావాదేవిలు ఆపివేయాలని జనవరి 23న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. ఈ కంపెనీకి ఎందుకు ప్రాజెక్టులు ఇచ్చారని కోర్టు ప్రశ్నించినా కార్యకలాపాలు సాగిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలకు వరుసగా నోటీసులు ఇచ్చి విచారణ జరపడం వెనుక రేవంత్ రెడ్డి బినామా బాగోతం సుప్రీంకోర్టులో బయటపడటమే కారణమని' కేటీఆర్ అన్నారు.

# దేశ సినీ పరిశ్రమకు
## హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తాం

నగరాల్లో సినీ పరిశ్రమ విస్తరణకు అవకాశాలు పరిమితంగా ఉన్నాయని, కానీ అన్ని భాషల పరిశ్రమలు హైదరాబాద్‌లో అభివృద్ధి చెందడానికి అనేక సానుకూల అంశాలు ఉన్నాయని భట్టి విశ్లేషించారు. సకల భాషల చిత్ర పరిశ్రమలు హైదరాబాద్‌కు తరలివస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లకు, రచయితలకు, దర్శకులకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ సినీ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారనుందని, ఇందుకు సంబంధించిన బ్లూప్రింట్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని వెల్లడించారు.

గత ప్రభుత్వం దశాబ్దాలుగా సినిమా అవార్డులను నిర్లక్ష్యం చేసిందని, కానీ తమ ప్రభుత్వం సినీ రంగానికి తిరిగి పురస్కారాలు అందించి ప్రోత్సహిస్తోందని భట్టి వివరించారు. సమాజం కోసం, కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని ఆయన కొనియాడారు. తెలంగాణ కళలు, సంస్కృతి, విప్లవ స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వ్యక్తి గద్దర్ అని, అందుకే ఆయన పేరు మీద గత ఏడాది నుంచి అవార్డులు అందిస్తున్నామని తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డుల ఎంపిక ఉంటుందని భట్టి హామీ ఇచ్చారు. గద్దర్ అవార్డుకు ఎంపికయ్యే సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు బలమైన సామాజిక సందేశం ఉండేలా చూడాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఈ నెల 6 నుంచి అవార్డుల స్క్రీనింగ్ ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి 19న ఉగాది పర్వదినం నాడు అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఈడీ కిశోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కేఎస్ రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నా జోలికి వస్తే నీ బతుకును రోడ్డుకీడుస్తా

గెలిపించాలని, మీరు ఓటు వేస్తే, తాను సిరిసిల్లను అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వ్యభిచారం చేస్తోందని సంజయ్ అన్నారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ, స్పీకర్ కేసు కొట్టేయడం దారుణమని చెప్పారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ స్థానంలో ఉండి చరిత్రహీనులు కావద్దని సూచించారు.

# చంద్రబాబు, పవన్ సుదీర్ఘ సమావేశం

ఓ అభిప్రాయానికి వచ్చారు. ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి అంశాలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలని, ఇందుకోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు కలిసి ఉమ్మడి మీడియా సమావేశాలు నిర్వహించాలని పవన్ సూచించినట్లు సమాచారం. రాబోయే 15 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగేలా పటిష్టమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలనే దిశగా కూడా వీరి మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. మంగళవారం కేబినెట్ భేటీకి ముందు చంద్రబాబు, పవన్ క్లుప్తంగా మాట్లాడుకున్నప్పటికీ, అన్ని అంశాలపై విపులంగా చర్చించేందుకు బుధవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

# మున్సిపల్ టికెట్ వివాదం నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం

**- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పై స్థానికుల ఆగ్రహం**





చొప్పదండి (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా,చొప్పదండి పట్టణానికి చెందిన కల్లెపల్లి మహేష్--కోమల దంపతులు మున్సిపల్ ఎన్నికల టికెట్ విషయంలో తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు కౌన్సిలర్ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ తరపున బీఫామ్ ఇప్పిస్తానని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హామీ ఇచ్చారని, అయితే తరువాత వేరే వ్యక్తికి టికెట్ ఇచ్చారని వారు ఆరోపించారు. ఈ విషయమై తీవ్ర మనస్తాపానికి గురైన మహేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. మహేష్ కుటుంబ సభ్యులు, అనుచరులు మాట్లాడుతూ తమకు హామీలు ఇచ్చి చివరికి నిరాశపరిచారని ఆరోపించారు. అలాగే కొన్ని ఉన్నత నాయకుల పేర్లు ప్రస్తావిస్తూ ఒత్తిడి కారణంగానే టికెట్ మారిందని తమకు చెప్పారని పేర్కొన్నారు.

**స్థానికుల - కుటుంబ సభ్యుల స్పందన**

ఈ ఘటనపై పలువురు స్థానికులు,కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు హామీలు ఇస్తే వాటిని నిలబెట్టుకోవాలని, లేకపోతే స్పష్టత ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికల సమయంలో ఇలాంటి పరిణామాలు ప్రజల్లో అనుమానాలకు దారితీస్తాయని అన్నారు. మరికొందరు రాజకీయ వ్యవహారాలు వ్యక్తుల ప్రాణాలపై ప్రభావం చూపే స్థితికి రావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

# సౌదీ జైలులో ఉన్న కముటం వెంకటేష్ విడుదలకు చర్యలు తీసుకోవాలి

**- జిల్లా ఎస్పీకి ఎస్సీ,ఎస్టీ కమీషన్ చైర్మన్ లేఖ అందజేత**

**- నకిలీ ఏజెంట్ పై చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి**




సిరిసిల్ల /బోయినిపల్లి రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన కముటం వెంకటేష్ అనే యువకుడు సౌదీ అరేబియాలో అక్రమ కేసులో ఇరుక్కొని జైలు జీవితం గడుపుతున్న వెంకటేష్‌ను త్వరగా విడుదల చేయించాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు, ప్రజా ప్రతినిధులు అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితేను కలిసి వినతిపత్రం సమర్పించారు.తెలంగాణ రాష్ట్ర ఎస్సీ--ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అందించిన లేఖను జిల్లా ఎస్పీకి అందజేస్తూ, వెంకటేష్ విదేశీ ఉద్యోగం పేరుతో మోసపోయినట్లు వివరించారు. నకిలీ ఏజెంట్ తునికి శేఖర్ కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపిస్తూ, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అతనికి సహకరించిన వారినీ గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ వినతిలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ--ఎస్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తడగొండ సత్యరాజ్ వర్మ, ఎస్సీ--ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు తడగొండ నర్సింగ్ బాబు, బీజేపీ నాయకులు పెంచాల మహేష్, సూదుల సాయి అక్షిత్,రామంచ సురేష్,వెంకటేష్ మాతృమూర్తి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. ఇదే సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా దర్బార్‌లోనూ, డీజీపీ కార్యాలయంలోనూ ఫిర్యాదులు చేసినట్లు వారు తెలిపారు. విదేశాల్లో చిక్కుకున్న వెంకటేష్‌ను స్వదేశానికి తీసుకురావడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# 24 వార్డులకు 18 వార్డులు గెలువబోతున్న కాంగ్రెస్ పార్టీ

**మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి**



మేడ్చల్( ప్రశ్న న్యూస్) రాబోయే ఎల్లంపేట పురపాలక సంఘం ఎన్నికల్లో మూడు పురపాలక సంఘంలలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి దీమా వ్యక్తం చేశారు. మంగళవారం మేడ్చల్ పట్టణంలోని కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యాలయంలో సుదీర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పురపాలక సంఘం ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు భీ ఫారామ్ లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి పురపాలక సంఘం చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని తెలిపారు. ఎల్లంపేట్ పురపాలక సంఘం పరిధిలో 24 వార్డులకు 18 వార్డులు కాంగ్రెస్ గెలువబోతుందని జోష్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీ ఫారమ్ ఇచ్చిన అభ్యర్థులకు ప్రతి ఒక్కరు సహకరించాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఎవరైనా పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పనిచేసినట్లు తెలిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలు దోపిడికి గురయ్యారని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి నాశనం చేసిందన్నారు. అప్పులపాలైన రాష్ట్రాన్ని గాడిలోకి తీసుకువచ్చే ప్రయత్నం సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటూ వస్తుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యే పురపాలక సంఘం ఎన్నికల పోటీ ఉండనుందన్నారు. పైసలిచ్చి టికెట్ కొనుకునే మల్లారెడ్డికి కాంగ్రెస్ తో పొంతన పెట్టవద్దన్నారు. బిజినెస్ కోసమే మల్లారెడ్డి రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. పైప్ లైన్ సమస్య వల్ల రాష్ట్రంలో నీటి సమస్య ఉందని, త్వరలోనే అది పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పురపాలక సంఘం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, గౌడవెల్లి మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి, మాజీ కౌన్సిలర్ కౌడ మహేష్, నాయకులు శివ శంకర్, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్ అభ్యర్థులకు ఖర్చు రూ.లక్ష దాటొద్దు

**ఎల్లంపేట పురపాలక ఎన్నికల్లో వ్యయ పరిమితులు**

**ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ఖరారు**

**పురపాలక సంఘం పరిధిలో 7 రోజుల పాటు**

**అధికారిక కార్యక్రమాలు బంద్**

**అత్యవసర పనుల కోసం ప్రత్యేక స్క్రీనింగ్ కమిటీలు**

**పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలపై ఆరా**





మేడ్చల్( ప్రశ్న న్యూస్) పురపాలక సంఘం ఎన్నికల నేపథ్యంలో పురపాలక సంఘల పరిధిలో ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి పనులకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. అయితే వార్డు కౌన్సిలర్ స్థానాలకు పోటిచేస్తున్న అభ్యర్థుల వ్యయపరిమితులపై ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలు ఖరారు చేసింది. ఎల్లంపేట పురపాలక సంఘం వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల్లో గరిష్ఠంగా రూ. లక్ష తమ వ్యయపరిమితి మించకూడదని స్పష్టం చేసింది. ఎన్నికల ఖర్చులపై ఇప్పటికే వ్యయ పరిశీలకులు అభ్యర్థుల వివరాలపై ఆరా తీస్తుంది. అభివృద్ది పనులకు బ్రేక్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో 7 రోజుల పాటు పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వపరమైన ఎలాంటి అధికారిక కార్యక్రమాలు నిర్వహించడానికి వీలు లేకుండాపోయింది. ఓటర్లను ప్రభావితం చేసే కొత్త పథకాల ప్రకటనలు, శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో పూర్తిగా నిలిచిపోనున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు అధికార వాహనాల్లో పర్యటించడం గాని, సమీక్ష నిర్వహించవద్దని ఆదేశాలు జారీ అయ్యాయి. కేవలం ఎన్నికలు జరుగుతున్న పురపాలక సంఘం పరిధిలో మాత్రమే ఎన్నికల కోడ్ పరిమితమయింది. ఎన్నికల షెడ్యూల్ ముందే ఆగమేఘాల మీద పురపాలక సంఘం నిధుల మంజూరుకు సంబంధించిన జీవోలను జారీ చేయించుకుని పనులు ప్రారంభించారు. నోటిఫికేషన్ విడుదల కావడంతో ప్రారంభమైన పనులన్ని మరో 15 రోజులపాటు ఆగిపోయే పరిస్థితి నెలకొంది.

### అత్యవసర పనుల కోసం ప్రత్యేక స్క్రీనింగ్ కమిటి..

ఎన్నికల కోడ్ కారణంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా, పాలనపరమైన సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం పత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. అత్యవసర పనులకు సంబంధించి తుది నిర్ణయాల కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ప్రత్యేక స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేసారు. పురపాలక సంఘం పరిధిలో అత్యవసర విభాగాల్లో ఏదైన సమస్య తలెత్తుతే దానికి సంబంధించిన పనులు చేపట్టాలా వద్దా అన్న విషయం ఈ కమిటి నిర్ణయం తీసుకోనుంది. సాధారణ అభివృద్ధి పనులను పక్కన పెట్టి కేవలం ప్రజా అవసరాలకు అత్యంత కీలకమైన, ఆకస్మికంగా వచ్చే విపత్తుల విషయంలో మాత్రమే సమస్య పరిష్కారాన్ని కనుగొంటారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఉండే నిర్ణయాన్ని ఈ కమిటి అనుమతించదు. పురపాలక సంఘంలో కొత్తగా టెండర్లు పిలవడం, కాంట్రాక్టులు ఖరారు చేయడం కదరదని, ఎన్నికల కోడ్ పక్కా అమలులో ఉంటుందని అధికారులు చెపుతున్నారు. పురపాలక శాఖ కమిషనర్, సిబ్బందికి సైతం ఎన్నికల కోడ్కు అనుగుణంగా జిల్లాకలెక్టర్ సైతం అధికారులకు సూచనలు జారీ చేసారు.

# వార్షికోత్సవ వేడుకలు ఘనంగా



పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్) బీరంగూడలోని అకాడెమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలు హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో



బీరంగూడ నుండి వచ్చిన చిన్నారులతో పాటు వివిధ తరగతుల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటకాలు, పాటలు, థీమ్ ఆధారిత కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచిన ఈ వేడుకలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు గౌరవ అతిథులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థులను హర్షాతిరేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల అంకితభావం, పాఠశాల యాజమాన్య సహకారంతో ఈ వార్షికోత్సవ వేడుకలు ఘనవిజయంగా ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# అనంతపల్లిలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**- ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశాం**

**- అంబేద్కర్ యూత్ సభ్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్,న్యాయవాది : కన్నం సుదర్శన్**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అనంతపల్లి గ్రామ అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయితీ ఆవరణలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగిన ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. కరీంనగర్‌కు చెందిన మురుగన్ హాస్పిటల్ వైద్య బృందం డాక్టర్ కుమార్ బాచు నేతృత్వంలో రోగులను పరీక్షించింది. శిబిరంలో భాగంగా ఓపీ సేవలు, బీపీ, బరువు, షుగర్ పరీక్షలు, గుండె సంబంధిత ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు.గ్రామంలోని పేద ప్రజలు, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు కన్నం సుదర్శన్ మాట్లాడుతూ, "గ్రామాల్లో చాలా మంది చిన్న ఆరోగ్య సమస్యలను కూడా నిర్లక్ష్యం చేస్తుంటారు. అలాంటి వారికి వైద్యం దగ్గరికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ శిబిరం ఏర్పాటు చేశాం. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుంది. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తాం" అని తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు.ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు కన్నం సుదర్శన్ సామాజిక సేవా దృక్పథాన్ని హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.

# చిన్నారుల శారీరక వికాసానికి పోషకాహారం అవసరం

**- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**

**- విలాసాగర్‌లో బాలమృతం,గుడ్ల పంపిణీ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామంలోని అంగన్వాడి సెంటర్--1లో బాలల పోషకాహారాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో బాలమృతం,కోడి గుడ్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ, వార్డు సభ్యుడు దమ్మ వెంకటరమణ, గ్రామ కార్యదర్శి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి టీచర్ శైలజ, ఆయమ్మ, పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ బాలల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని, బాలమృతం, కోడిగుడ్లు పిల్లల శారీరక-మానసిక అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ శైలజ కూడా పిల్లల పోషణపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. వార్డు సభ్యుడు దమ్మ వెంకటరమణ పిల్లల ఆరోగ్యం గ్రామాభివృద్ధికి పునాది అని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని ఆహ్వానించిన అంగన్వాడి టీచర్ శైలజకు స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుడు,కార్యదర్శి చేతుల మీదుగా పిల్లలకు బహుమతులు పంపిణీ చేశారు.

# లంచాలు పెట్టు అక్రమ నిర్మాణాలు కట్టు

**కాపు సర్కిల్లో అక్రమ నిర్మాణాల పరంపర**

**చైన్ మెన్ కనుసైగల్లో యథేచ్ఛగా నిర్మాణాలు**







కాప్రా (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసి లో అవినీతి అక్రమాలు తీవ్రస్థాయికి చేరుతున్నాయి చైన్ మెన్ కనుసైగల్లో భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోకుండా సెటిల్మెంట్లో చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి కొట్టి అధికారులు సిబ్బంది ఏకమే అక్రమ సంపాదన లక్షల్లో చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారన్న ఆరోపణ వెలువెత్తుతున్నాయి. దానికి తోడు స్థానిక రాజకీయ నాయకుల అండ ఉండడంతో ఇంకేముంది అక్రమ నిర్మాణాలే అక్రమ నిర్మాణాలు అన్నట్లుగా మారింది కాప్రా సర్కిల్ పరిస్థితి. చర్లపల్లి డివిజన్ కాలనీల్లో 'టౌన్ ప్లానింగ్' వైఫల్యంపై స్థానికుల నుండి విమర్శలు వెలుగుతున్నాయి. కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. 'నిబంధనలు గాలికి.. నిర్మాణాలు నింగికి' అన్నట్లుగా చర్లపల్లి డివిజన్‌లోని పలు కాలనీలు అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారుతున్నాయి. క్షేత్రస్థాయిలో నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నా, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీకాలనీ, ఎంఎంఆర్ కాలనీ, నాగార్జునగర్, చక్రిపురం కాలనీల్లో అక్రమ నిర్మాణాల పర్వం కొనసాగుతోంది. తీసుకున్నఅనుమతులకు చేపడుతున్న నిర్మాణాలకు ఏలాంటి పొంతనలేకుండానే నిర్మాణలు చేపడుతున్నా అధికారులు పట్టించుకున్న దఖలు కనిపించడం లేదు. సెట్ బ్యాక్స్ వదలకుండా, ఆదనపు అంతస్తుల నిర్మాణాలు ఇక్కడ సర్వసాధారణంగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల కనీసం భవన నిర్మాణ అనుమతులు కూడా లేకుండానే భారీ స్లాబులు పడిపోతున్నాయి. స్థానిక కాలనీవాసులు ఫిర్యాదులు చేసినా అధికారులు తూతూమంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ దశలోనే చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం, భవనం పూర్తయ్యే వరకు మౌనంగా ఉండటం వెనుక భారీ స్థాయిలో 'అవినీతి' హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అక్రమ కట్టడాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశిస్తున్నా, కాప్రాలో మాత్రం క్షేత్రస్థాయి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ భవనాల వల్ల డ్రైనేజీ వ్యవస్థపై ఒత్తిడి పెరగడమే కాకుండా, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు కనీసం ఫైర్ ఇంజన్ వెళ్లేందుకు కూడా దారి ఉండటం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్లపల్లి డివిజన్‌లోని అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# హస్తాన్ని హడలెత్తిస్తున్న కారు పార్టీ

**పార్టీ అధికారంలో ఉన్నప్పటికి పట్టుదలగా తీసుకున్న అధినేత.**

**టికెట్లు ప్రకటించిన వెంటనే మంథనిలో మఖాం.**

**ఒకపక్క కారు పార్టీ మరోపక్క ఇండిపెండెంట్ అభ్యర్థులతో కొంత టెన్షన్.**

**5 వార్డుల్లో గట్టి పోటీ ఇస్తున్న కారు పార్టీ.**

**రెండు వార్డుల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులతో ఇబ్బంది.**




మంథని ( ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల పెద్దపల్లి జిల్లాలోని మంథని మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్ర మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నిక కావడంతో అందరిచూపు మంథని వైపే అన్నట్టుగా ఉంది. అభ్యర్థులను ప్రకటించిన వెంటనే ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యూహాలను అనుసరిస్తూ నియోజకవర్గంలోనే ఉంటూ వ్యూహాలను పన్నుతున్నారు. టిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన అభ్యర్థులను ఆ పార్టీ నాయకత్వం ప్రకటించిన వెంటనే అభ్యర్థులను అందుబాటులో లేకుండా ఇతర ప్రాంతాలకు (చంద్రాపూర్) తరలించినట్టుగా ప్రచారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించినంత సేపు శ్రీధర్ బాబు స్థానికంగా లేకపోయినప్పటికీ ప్రకటన పూర్తయిన వెంటనే మంథనిలో మకాం వేసి అభ్యర్థులకు అండగా ప్రచారాన్ని సైతం ప్రారంభించారు. పార్టీ అధికారం లో ఉన్నప్పటికీ ప్రతిపక్షం గట్టి పోటీ ఇస్తుందని సమాచారంతో పకడ్బందీ వ్యూహాలు పన్నుతున్నారట. ఇప్పటికే అసంతృప్తులు గా ఉన్న కొంతమందిని బుజ్జగించినప్పటి కీ కొన్ని వార్డుల్లో అసంతృప్తులతో తమకు ఇబ్బంది కలుగుతుందని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. దీనికి తోడు సుమారు ఐదు వార్డుల్లో టిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన అభ్యర్థులు బలంగా ఉండడంతో తలమునకలవుతున్నారట అధికార పార్టీ నాయకులు. మున్సిపాలిటీలోని 1,2,3,6,7,8, వార్డులలో టిఆర్ఎస్ పార్టీ, ఇండిపెండెంట్ అభ్యర్థుల ప్రబల్యం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల కంటే ఎక్కువగా ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. పెద్దపెల్లి జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉన్నప్పటికీ జిల్లా మొత్తం చూపు మంతిని వైపే ఉండడం గమనార్హం. ఒకపక్క మున్సిపాలిటీలో తమ ప్రభావాన్ని చూపుకోవాలనీ బిఆర్ఎస్ పార్టీ మరోపక్కమున్సిపాలిటీ కైవసం చేసుకున్నప్పటికిని బిఆర్ఎస్ ను కట్టడి చేయాలని ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. వేచి చూడాలి మంథని మున్సిపాలిటీలో కారు జోరుని తగ్గించి హస్తము హవా కొనసాగుతుందా లేదా అనేది.

# కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది

**కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి చేసిచూపుతాం**

**మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి**





మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే మెదకు అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతామని జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మెదక్, రామయంపేట పట్టణంలోని కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ పేరుతో గత ప్రభుత్వం రూ.65 వేల కోట్లను మింగిందని విమర్శించారు. ప్రజలకు మంచి భోజనం అందాలనే ఉద్దేశంతో సన్న బియ్యం అందిస్తున్నామని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మెదక్ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేశామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. మెడికల్ కాలేజీ ద్వారా స్థానిక విద్యార్థులు డాక్టర్లుగా మారాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ అభ్యర్థులు నరేష్, లక్ష్మిలను చేయి గుర్తుపై ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించామని చెప్పారు. గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రేషన్ కార్డులు ఇచ్చిందన్నారు. ఇచ్చిన కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూసే ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతో గత ప్రభుత్వం రైతు బంధు అమలు చేసిందన్నారు. గతంలో నియోజకవర్గానికి రూ.2000 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. అనంతరం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ఏడుపాయల ప్రాంతానికి గతంలో ఏ సీఎం రాలేదని, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి రూ.35 కోట్ల అభివృద్ధి నిధులు ఇచ్చారని చెప్పారు. మెదక్ చర్చికి గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, సీఎం రేవంత్ రెడ్డి రూ.29.30 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. వరదల సమయంలో ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టిందని, బాధితులకు పరిహారం అందించిందన్నారు.

సీఎం రేవంత్‌కు అభివృద్ధి చేయాలనే కసి ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పట్టణాల అభివృద్ధి చెందాలంటే కేవలం కాంగ్రెస్ హయాంలోనే సాధ్యమైన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మాజీ చంద్రపాల్ కౌన్సిలర్లు, బొద్దుల కృష్ణ, రాగి అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**మేడ్చల్ సీఐ అద్దాని సత్యనారాయణ**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) త్వరలో జరగబోయే ఎల్లంపేట పురపాలక సంఘం ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని మేడ్చల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అద్దాని సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఎన్నికల నియమావలిని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోకతప్పదని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం రూ.50 వేల కంటే ఎక్కువ నగదు దొరికినట్లైతే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. సరైన ఆధారాలు తనిఖీలు నిర్వహించే అధికారులకు చూపించి సహకరించాలన్నారు. ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని వార్డులలోని ప్రజలకు ఎన్నికల కోడ్ నిబంధనలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో శాంతిభద్రతలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని అలాంటి ఓటు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు.

## 21వ వార్డులో నరాల శేఖర్ గెలుపే లక్ష్యంగా

# కారుకు జోరెత్తిన ప్రచారం

**- అభివృద్దే నినాదం - కారుకు పెరుగుతున్న మద్దతు**

**-ఇంటింటికి విస్తృత ప్రచారం - కారు గుర్తుకే పట్టం కడుతామంతున్న వార్డు ప్రజలు**

**- మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే....మరింత అభివృద్ధి చేసి చూపిస్తా**

**- 21 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి : నరాల శేఖర్**






వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపల్ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం వేగం పెంచింది. పార్టీ అభ్యర్థి నరాల శేఖర్ విజయానికి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నేత పొలాస నరేందర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచార బృందం ప్రతి ఇంటిని సందర్శిస్తూ గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తు చేసింది. కారు గుర్తుకే ఓటేయాలని ఓటర్లను కోరింది. ప్రచారానికి వార్డు పరిశీలకులు గడ్డం భూమారెడ్డి, ముంజ దశగౌడ్, దొబ్బల జలంధర్, సూరినేని నర్సింగరావు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా పొలాస నరేందర్ మాట్లాడుతూ – “బీఆర్ఎస్ హయాంలోనే వార్డు అభివృద్ధి దిశగా ముందడుగు వేసింది. ఆ అభివృద్ధి కొనసాగాలంటే నరాల శేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి” అని పిలుపునిచ్చారు. అనంతరంఅభ్యర్థి నరాల శేఖర్ మాట్లాడుతూ – “పదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాను. మరోసారి అవకాశం ఇస్తే వార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాను” అని హామీ ఇచ్చారు. ప్రచారంలో మాజీ కౌన్సిలర్ నరాల లావణ్యతో పాటు వొద్యాల హరిత,దమ్మ బాస్కర్, నేరెళ్ల సందీప్, బెల్ల దిలీప్, ఇప్పాపుల వెంకటేష్,సంజీవ్, అవుటబాబు, బత్తుల చింటు తదితరులు పాల్గొన్నారు. పలుచోట్ల ప్రజలు కారుకు మద్దతు తెలుపుతూ నీరాజనం పలికారని,తమ ఓటు బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకే వేస్తామని స్థానిక వార్డు ప్రజలు సంపూర్ణ మద్దతు పలికారని నాయకులు తెలిపారు.

# గ్రామాభివృద్ధిలో మరో ముందడుగు - శుద్ధజలానికి ప్రాధాన్యం

**- గ్రామ ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట**

**- సర్పంచ్ భాస్కర్ వినూత్న నిర్ణయం**

**- గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే నా లక్ష్యం**

**- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకవర్గం సభ్యులు,పంచాయతీ కార్యదర్శి,గ్రామ పెద్దలు, ప్రజలు హాజరయ్యారు. గ్రామసభలో గ్రామ ప్రజలకు తక్కువ ధరలో శుద్ధమైన తాగునీరు అందించే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి కుటుంబానికి కేవలం రూ.2లకే 20 లీటర్ల శుద్ధమైన మినరల్ వాటర్ అందించాలని సర్పంచ్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు పాలకవర్గం సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడం పంచాయతీ ముఖ్య బాధ్యత అని అన్నారు. నీటి కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కేవలం రూ.2లకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందించడం గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణకే తీసుకున్న చర్య అని పేర్కొన్నారు. గ్రామసభలో తీర్మానం ఆమోదం పొందడం సంతోషకరమని, త్వరలోనే ఈ పథకాన్ని అమలు చేస్తామని అన్నారు. గ్రామ ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరుతూ, గ్రామ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ వెల్లడించారు.

# 21వ వార్డులో జోరందుకున్న ఎన్నికల ప్రచారం

**- భారీ మెజారిటీ లక్ష్యంగా విస్తృత ప్రచారం**

**- మరోసారి ఆశీర్వదించి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తా**

**- 21 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి : నరాల శేఖర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో 21వ వార్డులో ప్రచార వేడి రోజురోజుకూ పెరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి నరాల శేఖర్ విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మాజీ సర్పంచ్, పార్టీ సీనియర్ నేత పొలాస నరేందర్ నేతృత్వంలో జరిగిన ప్రచారానికి వార్డు ప్రజల నుంచి స్పందన లభిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. బుధవారం ఇంటింటికీ వెళ్లిన ప్రచార బృందం గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, అభివృద్ధి పరంపర కొనసాగాలంటే కారు గుర్తుకే ఓటేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో వార్డు పరిశీలకులు గడ్డం భూమారెడ్డి, ముంజ దశగౌడ్, దొబ్బల జలంధర్, సూరినేని నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ పొలాస నరేందర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలోనే వార్డుకు మౌళిక సదుపాయాలు మెరుగుపడ్డాయని, అదే దిశలో అభివృద్ధి కొనసాగాలంటే నరాల శేఖర్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం అభ్యర్థి నరాల శేఖర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, మరోసారి అవకాశం ఇస్తే వార్డును మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని తెలిపారు. ప్రచారంలో మాజీ కౌన్సిలర్ నరాల సౌజన్యతో పాటు వొద్యాల హరిత, దమ్మ బాస్కర్, నేరెళ్ల సందీప్, బెల్ల దిలీప్, ఇప్పపూల వెంకటేష్, సంజీవ్, అవుట బాబు, బత్తుల చింటు తదితరులు పాల్గొన్నారు. స్థానికులు పలుచోట్ల అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నట్లు పార్టీ నేతలు పేర్కొన్నారు.

# రెవెన్యూ నివేదికతో గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి

**- ఖాళీ స్థలాన్ని గ్రామ పంచాయతీ ఆధీనంలోకి తీసుకోవాలని కోరిన చెంచు సంపత్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని పార్కు స్థలంలో ఆక్రమంగా నిర్మాణం జరిగిందని ఆరోపిస్తూ, ఆ నిర్మాణానికి అనుబంధంగా ఉన్న ఖాళీ ప్రదేశాన్ని పంచాయితీ ఆధీనంలోకి తీసుకోవాలని కోరుతూ నీలోజిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన చెంచు సంపత్ గ్రామ పంచాయితీ కార్యదర్శి స్వప్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ప్లాట్ నంబర్ 1032కు సంబంధించి గతంలో హైకోర్టులో పిర్యాదు చేసినట్లు, ఆ కేసు ప్రస్తుతం విచారణలోనే కొనసాగుతోందని సంపత్ తెలిపారు. మండల రెవెన్యూ అధికారుల నివేదిక ప్రకారం నిర్మాణంలో ఉన్న స్లాబ్‌ను మినహాయించి మిగిలిన ఓపెన్ ప్రదేశాన్ని గ్రామ పంచాయితీ నియంత్రణలోకి తీసుకోవాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్ సూచించినట్టు పేర్కొన్నారు. ఆ నివేదిక ప్రతిని వినతిపత్రానికి జతచేసినట్లు వివరించారు. ఈ అంశంపై గ్రామ పంచాయితీ కార్యదర్శి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# కుటుంబ సర్వే వేగవంతం కావాలి

**- అక్షరాంధ్ర లక్ష్యాలను సాధించాలి**

**- వీడియో కాన్ఫరెన్స్ లో స్పష్టం చేసిన జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్**



అనకాపల్లి (ప్రశ్న న్యూస్) వచ్చే రెండు రోజుల్లో ఫామిలీ సర్వే పూర్తి చేయాలని కలెక్టరు విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ కుటుంబ సర్వే, అక్షర ఆంధ్ర, ఈ.పి.టి.ఎస్ అప్లోడ్ తదితర కార్యక్రమాల పై వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా మండల వారీగా ఎంపీడీఓల తో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గృహ సర్వే గడువు లోపలే శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 72 శాతం పూర్తయిందని, దీనిని ప్రాధాన్యతా కార్యక్రమంగా భావించి పూర్తి చేయాలన్నారు.అక్షరాంధ్ర కార్యక్రమం క్రింద జిల్లాలో 89944 మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారందరినీ వాలంటీర్ల తో మ్యాప్ చేసి అక్షరాస్యులుగా దిద్దే కార్యక్రమం వెంటనే జరగాలని, మార్చి నెలలో నిర్వహించే ప్రత్యేక పరీక్షకు సిద్ధం చేయాలని తెలిపారు. ఇప్పటికే వారికి అవసరమగు పుస్తకాలు, పెన్సిళ్లు తదితర సామగ్రి వచ్చిందని, అక్షరాస్యత కార్యక్రమాలు వేగంగా జరిగెలా చూడాలని డి.ఆర్.డి. డ్వామా, ఎస్ జి ఎస్ డబ్ల్యూ శాఖల జిల్లా అధికారులకు ఆదేశించారు. జిల్లాలో వాలంటీర్ల రిజిస్ట్రేషన్ శాతం జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ.పి.టి.ఎస్ వెబ్సైట్ నందు కార్యాలయాల నుండి జారీ చేసిన, కార్యాలయాలకు అందిన డాక్యుమెంట్లను ప్రతి కార్యాలయం నుండి ప్రతి రోజూ అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి నెలలో కనీసం 3 నుండి 5 ఉద్యోగి సామరర్థ్యం పెంచే కోర్స్ లను ఐ గాట్ కర్మ యోగి పోర్టల్ నందు శిక్షణ పొందవలసినదిగా ఉద్యోగుల ను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డి ఆర్డి ఎ, డ్వామా పధక సంచాలకులు శచి దేవి, పూర్ణిమ దేవి, ఎస్ జి ఎస్ డబ్ల్యూ సమన్వయ అధికారి ఎస్ మంజుల వాణి, వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా అన్ని మండలాల ఎంపీడీఓ లు, నర్సీపట్నం, యలమంచిలి, అనకాపల్లి మున్సిపాల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో పోటీపడాలి

**- రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక పల్లా శ్రీనివాసులు**



విశాఖ ( ప్రశ్న న్యూస్) 86వ వార్డు బ్రహ్మవరత్ నగర్ కాలనీ వాసులు సొంత నిధులతో నిర్మించిన కల్వర్టును పల్లా శ్రీనివాస్ ప్రారంభించారు. వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నల్లూరు సూర్యనారాయణ ఆద్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు జరగడం అభినందనీయం అని అన్నారు. స్థానికుల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ తనవంతు కృషి చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో వార్డు క్లస్టర్ ఇంచార్జ్ వేగుంట శ్రీనివాస్, జనసేన వార్డు అధ్యక్షులు కాదా శ్రీను, బిజెపి మండల అధ్యక్షులు అశోక్, వార్డు టిడిపి ప్రెసిడెంట్ కొర్లన రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయుడు నాగేశ్వరరావు, కసాపు వెంకటేష్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మనపురం గణపతి, వార్డు బీసీ సెల్ అధ్యక్షులు సుబ్బయ్య, అధ్యక్షురాలు గుంపన వెంకటలక్ష్మి, వార్డు తెలుగు యువత అధ్యక్షులు అరిపాక లక్ష్మణ్ వార్డు నాయకులు రమణారావు, గోవింద ప్రధాన్,శ్రీనివాస్,అప్పలనాయుడు, నాగేశ్వరరావు, చందన,బుర్ర లక్ష్మి, సుబ్బలక్ష్మి, అప్పలస్వామి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు

## శ్రీకాళహస్తి విక్రమ్ డిగ్రీ కళాశాలలో

# జాబ్ మేళా

**- జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి లోకనాథం**




శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) నియోజకవర్గంలోని యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని , అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ సిడాప్ ఆధ్వర్యంలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే , ఆదేశాల మేరకు విక్రమ్ డిగ్రీ కళాశాల శ్రీకాళహస్తి నందు జాబ్ మేళా నిర్వహించడం జరిగినది.జాబ్ మేళా ను ఉద్దేశించి ఆర్ లోకనాథం జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి 20 లక్షలు ఉద్యోగాలలో భాగంగా స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు విక్రమ్ డిగ్రీ కళాశాల నందు ఈరోజు జాబ్ మేళా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు.ఈ జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన వారికి 13000/- నుంచి 20000/- వరకు కనీస వేతన సదుపాయం కలదు అని తెలియజేశారు అదేవిధంగా ఉద్యోగంలో సెలెక్ట్ కాని వారికి త్వరలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శ్రీకాళహస్తి నియోజకవర్గం లో ఎస్ వి ఏ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, స్కిల్ హబ్ ఏర్పాటు చేశామని అందులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం నిరంతరం జరుగుతున్నది.ఈ కార్యక్రమంలో భాగంగా వి.పట్టాభి ప్రిన్సిపాల్, విక్రమ్ డిగ్రీ కళాశాల వారు మాట్లాడుతూ చదువుకొని ఖాళీగా ఉన్నటువంటి వారికి అలాగే ఫైనల్ ఇయర్ చదువుతున్నటువంటి వారికి ఇలాంటి జాబ్ మేళా జరగడం వల్ల ఉద్యోగ అవకాశాలు పొంది ఆర్థికంగా, సాంఘికంగా వారి కుటుంబానికి అండగా ఉంటూ వారు ఎదుగుదలకి చాలా మంచిగా దోహదపడతారని తెలియజేశారు.అదేవిధంగా జాబ్ మేళాకు హాజరైన యువతీ యువకులకు ఆల్ ది బెస్ట్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వి.పట్టాభి , ప్రిన్సిపాల్, విక్రమ్ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి, ఆర్. లోకనాథం,జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, తిరుపతి జిల్లా, విక్రమ్ డిగ్రీ కళాశాల సిబ్బంది ఏపీ ఎస్ ఎస్ డి సి తిరుపతి జిల్లా సిబ్బంది మొదలగువారు పాల్గొనడం జరిగినది.

# సమాజ ప్రగతిలో జర్నలిస్టులదే కీలక పాత్ర

**- ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలి**

**- వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదు 8 వరకు గడువు పెంపు**

**- జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల**



**విశాఖ (ప్రశ్న న్యూస్)** సమాజ ప్రగతిలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అటువంటి వారి సేవలను ప్రభుత్వాలు మరింతగా గుర్తించాల్సిన అవసరం ఉందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి( ఎన్ ఎ జె) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు పేర్కొన్నారు. ఈ మేరకు విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఏపీఎన్జీవో హోం లో వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదులో వీరు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా మరిన్ని ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.. అలాగే చాలా కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ప్రమాద బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని కోరారు.. ఈ పథకం అమలులో ఉంటే జర్నలిస్టులు జీవితాలకు చాలా వరకు భరోసా కలుగుతుందన్నారు.. గతంలో ప్రీమియం రెండు వందలు చెల్లిస్తే దానికి ప్రభుత్వం కొంత మొత్తం జమ చేసేదని,, ఎవరైనా ప్రమాద బారిన పడినప్పటికీ బీమా సొమ్ము అందడం వల్ల వైద్యానికి ఇతర ఖర్చులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. కాబట్టి ఈ పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాల్సిందిగా వీరు కోరారు.. అలాగే పదవి విరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని.. హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాల్సి ఉందన్నారు..

**8 వరకు సభ్యత్వ నమోదు గడువు పెంపు**

ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నట్లు యూనియన్ నాయకులు గంట్ల శ్రీనుబాబు
పి .నారాయణ జి .శ్రీనివాసరావు లు తెలిపారు.. ఇప్పటివరకు సుమారు 300 మందికి పైగా జర్నలిస్టులు నూతన సభ్యత్వము..రెన్యువల్నును స్వీకరించడం జరిగిందన్నారు. అయితే ఇంకా అనేక మంది జర్నలిస్టులు సభ్యత్వం పొందాల్సి ఉన్నందున ఈ నమోదు ప్రక్రియను ఈనెల 8న సోమవారం వరకు పొడిగించినట్లు వీరు చెప్పారు.. ఆనందపురం పద్మనాభం భీమునిపట్నం తదితర ప్రాంతాల జర్నలిస్టుల సౌకర్యార్థం ఆదివారం ( ఫిబ్రవరి 7)భీమిలిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఏపీ ఎన్జీవో హోం లో ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.. అయితే తర్వాత గడువు పొడిగించే అవకాశం లేదన్నారు. కాబట్టి తక్షణమే అర్హులైన జర్నలిస్టులంతా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు. బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావు కార్యదర్శి కింతాడ మదన్.. మళ్ళ దేవ త్రినాథ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్. బొబ్బర ప్రసాద్. తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

# ఆధ్యాత్మిక శోభతో ఘనంగా ఏడుపాయల వనదుర్గ అమ్మవారి మహా శివరాత్రి జాతర నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**





మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) మహాశివరాత్రి ఏడుపాయల వనదుర్గ అమ్మవారి జాతర ఘనంగా జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లుగత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు అసౌకర్యం కలవకుండా విస్తృత ఏర్పాట్లుఏడుపాయల వనదుర్గ అమ్మవారి మహాశివరాత్రి సందర్భంగా జాతర ఏర్పాట్ల పై అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి , డీఎస్పీ ప్రసన్న కుమార్ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ఏడుపాయల హరిత హోటల్ నందు రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్మహాశివరాత్రి జాతర ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గ అమ్మవారి జాతర పరిసర ప్రాంతాలను వనదుర్గ అమ్మవారి పరిసర ప్రాంతాలను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్షించారు.ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు 3 రోజుల పాటు ఏడుపాయల జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్మా ట్లాడుతూఏడుపాయల అమ్మవారి క్షేత్రంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే జాతర ఆధ్యాత్మికంగా, దైవికంగా నిబంధనలు పాటిస్తూ, ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఏడుపాయల ఆలయంలో జరిగే పూజలలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని, శాస్త్రపరంగా అమ్మవారి పూజలు ఘనంగా జరగాలని, భక్తులకు త్వరగా దర్శనం లభించే విధంగా చర్యలు తీసుకోవాలని, జాతర నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ఏడుపాయల మహాశివరాత్రి జాతర సందర్భంగా ఎక్కువ బస్సు సర్వీసులు నడపాలని, జాతరకు ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తుల రద్దీ ఆధారంగా డిపో మేనేజర్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన రోడ్లలో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు. జాతర సందర్భంగా వచ్చే భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు కలక్కుండా ఎక్కడికక్కడ త్రాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ పరిసరంలో అపరిశుభ్రత కాకుండా మూడు షిఫ్ట్ లో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమైన ప్రదేశాలలో అన్ని పందిళ్ళ వద్ద మంటలు ఆర్పే ఫైర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు.జాతరను పర్యవేక్షించేందుకు అన్ని శాఖల అధికారుల నోడల్ ఆఫీసర్ల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, భక్తుల కోసం ఎక్కడికక్కడ హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులు మెచ్చేలా ఏర్పాటు చేసినట్లు వివరించారు.మత్స్య శాఖ ఆధ్వర్యంలో 150మంది గజ ఈతగాళ్లు2 ఫైర్ డిపార్ట్మెంట్ ద్వారా అగ్నిమాపక వాహనాలు, ఒక ద్విచక్ర వాహనం అందుబాటులో ఉంచుతున్నారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా 5 ప్రదేశాలలో క్యాంప్ లు, నాలుగు 108 అంబులెన్సు లు,లక్ష వో ఆర్ ఎస్ ప్యాకెట్ లు, మందులు, అంత్యవసర మందులు,28 మంది డాక్టర్లు, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ 4, 80 మంది ఆయుష్ డాక్టర్లు, ఏఎన్ఎంలు100, ఇతర వైద్య సిబ్బంది మొత్తం 300 మంది పనిచేస్తారని తెలిపారు.ఆర్టీసీ ద్వారా ప్రతి రోజు వివిధ రూట్లలో 140 బస్సులు మూడు రోజుల పాటు మొత్తం 420 బస్సులు నడుస్తాయని తెలిపారు.టేకుల గడ్డ బస్టాండ్ నుండి 10 ఉచిత మినీ బస్సులు తిరుగుతాయి తెలిపారు.ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 9 సంచార బృందాలు, 2 చెక్ పోస్టులు, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో 144 నల్లాలు, 45 మంది మానిటరింగ్ చేస్తారని,400 మంది కార్మికులు,498 మరుగు దొడ్లు, వాటర్ ట్యాంకర్లు 40, ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.జిల్లా పంచాయతీ శాఖ ద్వారా 18 మంది సెక్టార్ అధికారులు,180 మంది పంచాయతీ కార్యదర్శులు,640 మంది మల్టీ పర్పస్ కార్మికులు,రెండు షిఫ్టులో పని చేయనున్నారు .13 తేదీ నుంచి 18 వ తేదీ వరకు పనులు చేయనున్నారు. డస్ట్ బిన్స్, బ్లీచింగ్ పౌడర్, పాగింగ్ చేయనున్నారు.

**పోలీసు బందోబస్తు**

జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 04 డీఎస్పీలు, 23 మంది సీఐలు, 80మంది ఎస్సైలు, 45మంది ఏఎస్సైలు, 96మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 250 మంది కానిస్టేబుళ్లు, 84 మంది మహిళా కానిస్టేబుళ్లు, 234 మంది హోంగార్డులు, 14మంది మహిళా హోంగార్డులు మొత్తం 829 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, నాగ్సన్పల్లి సర్పంచ్ సుశీల, ఆలయ కార్య నిర్వహణ అధికారి, వీరేశం, తాసిల్దార్ సతీష్ కుమార్, కొల్చారం తాసిల్దార్ శ్రీనివాస చారి, వివిధ శాఖల జిల్లా అధికారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవ చేస్తా రాంపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**- సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్**

**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** కొల్చారం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవ చేస్తూ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్ తెలిపారు బుధవారం కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో మాట్లాడుతూ ఆలయాల వద్దకు కరెంటు సరఫరా తో పాటు గ్రామంలో మురికి కాలువల మరమ్మత్తులు తోపాటు సిసి రోడ్డు ఇరువైపులా మట్టి వేషయమని పేర్కొన్నారు ప్రజల దాహార తీర్చేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు తో పాటు తన సొంత డబ్బులతో ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు గ్రామంలో విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడి బల్బులు బిగించామన్నారు ప్రభుత్వం నుంచి విడుదలైన అభివృద్ధి పనులు కూడా వేగవంతం చేస్తున్నామని తెలిపారు పది లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు ప్రజలు నమ్మకాన్ని మమ్ము చేయకుండా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజాసేవ చేయడమే నా లక్ష్యన్నారు ఏది ఏమైనా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో పాటు నా సొంత డబ్బులతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు నల్ల పోచమ్మ గుడి వద్దకు కరెంట్ సరఫరా లేకపోవడంతో గత పది సంవత్సరాల నుంచి గ్రామస్తులు గతంలో పాలించిన సర్పంచులను అడిగిన పట్టించుకోలేదని తెలిపారు విద్యుత్ అధికారులతో మాట్లాడి ఐదు స్తంభాలు వేసమన్వానారు విద్యార్థులకు ఇబ్బందులు కలవకుండా సింగిల్ ఫేస్ ట్రాన్సారం వేరే చోటికి మార్చి గుడికి కరెంటు సరఫరా చేయడం జరిగిందని పేర్కొన్నారు ఈ



కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీశైలం వార్డు సభ్యులు బాలమణి మధు రాందాస్ గోవర్ధన్ రెడ్డి విట్టల్ రెడ్డి సాయిరాం రవి ముదిరాజ్ విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ సంగమేశ్వర్ రెడ్డి అనిల్ తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు



# మున్సిపల్ పీఠము ఎవరిని వరించనుందో?

**- ఏ పార్టీ మున్సిపల్ పీఠాన్నికైవసం చేసుకుంటుందో.**
**- ఓటరు తీర్పు ఏ పార్టీ వైపు ఉంటుందో?**

**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మున్సిపల్ పోరులో ఎవరి భవితవ్యం ఏమిటో కొద్ది రోజుల్లోనే తేలనుంది. భవితవ్యం పై ప్రధాన పార్టీలకు కునుకే కరువు ఎవరి వ్యూహం వారిదే.. ఎవరి ధీమా వారిదే..మున్సిపల్ గడ్డపై సాగుతున్న రాజకీయ కురుక్షేత్రం ఓటు ఎవరికి పట్టం కడుతుందో.. ఎవరికి గండం తెస్తుందో.?వేచి చూడాలి మరి ఓటరు దేవుడా.. నీ మనసెటు.? నాయకుల నోట పేలుతున్న మాటల తూటాలు. మున్సిపల్ వీధుల్లో రాజకీయ సందడి. ఆశల గుర్రాలు పందెంలో పరిగెడుతున్నాయి. గెలుపు జెండా కోసం తహతహలాడుతున్నవి. వివిధ పార్టీలు. మురిపించేవారెవరినో ముంచేదెవరినో..? ఓటరే దేవుడు..ఇక వారి తీర్పే ఎవరి వైపు ఉంటుందో. శిరోధార్యం ,మారనున్న రాజకీయ భవితవ్యం రాజకీయ చదరంగంలో గెలుపెవరిదో.. మలుపెవరిదో... అధికార పీఠం ఒకటే.. ఆశావహులు ఎందరో..? పలు మున్సిపాలిటీలో ముదిరిన పురపోరు .ఎవరి పట్టు వారిదే.. ప్రజా క్షేత్రంలో తేలనుంది అసలు సీసలైన దమ్ము. ఓటరు వేయనున్నాడు గెలుపు ముద్ర.మున్సిపాలిటీ యుద్ధంలో వార్డులే లక్ష్యం,గెలుపు గుర్రాలపైనే నేతల గురి. పార్టీల మధ్య ప్రతిష్టాత్మక పోరు.. తెలంగాణ లోని మంథని గడ్డపై మొదలైంది హోరాహోరీ వార్డు వార్డులో వ్యూహాల వేడి.. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో వాడి వేడి కనిపిస్తోంది. ప్రస్తుతం నియోజకవర్గాల్లో ఎక్కడ చూసినా రాజకీయ ప్రకంపనలే కనిపిస్తున్నాయి. పలు పార్టీల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు ఇప్పుడు మున్సిపాలిటీ పరిధిలో అత్యంత ఆసక్తికరంగా మారింది. వ్యూహ ప్రతివ్యూహాల నడుమ తెలంగాణ రాష్ట్ర రాజకీయ క్షేత్రంలో ప్రస్తుతం ఇరువురి నేతలు గెలుపు గుర్రాలపై ఆశలు . ఒకరు ప్రజాబలంతో అసెంబ్లీలో అడుగుపెట్టిన ప్రస్తుత శాసనసభ్యులు ఇంకొకరు అదృష్టం కలిసిరాక ఓడిన మాజీలు.. తమ నియోజకవర్గంపై తనదైన ముద్ర వేయాలని చూస్తున్న తాజా మాజీల ఆశయం ఒక్కటే.. పీఠంపై తమ జెండాలు ఎగురవేయడం. కానీ, ఆ గెలుపు బాట అంత సులభంగా కనిపించడం లేదు.మున్సిపాలిటీ ఓటరే 'పలు పార్టీలకు కీలకంగా మారనున్నాడు.నియోజకవర్గ గెలుపోటములను శాసించేది ప్రధానంగా రాష్ట్రం లోని మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లే. ఇక్కడి ఓటరు దేవుళ్ళు ఎటు మొగ్గు చూపుతారన్నదే ఇప్పుడు అందరిలోనూ నెలకొన్న ఉత్కంఠ. ప్రస్తుత ఎమ్మెల్యేలు తన అభివృద్ధి పనులతో ఓటర్లను మెప్పిస్తామనే ధీమాతో ఉన్నారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యేలు కేడర్‌ను బలోపేతం చేస్తూ తిరిగి పుంజుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.మురిపిస్తారా.? 'ముంచేస్తారా.?ఓటరు చేతులోనే పోరు భవితవ్యం తేలని ఉంది.రాజకీయ స్టంట్లు, ఆరోపణలు, విమర్శల పర్వం ఎలా ఉన్నా.. అంతిమ నిర్ణయం ఓటరు దేవుళ్ళదే. మున్సిపాలిటీలోని ప్రజలు ఒకరికి జై కొట్టి మురిపిస్తారా.? లేదా తమ ఓటు అనే ఆయుధంతో మరొకరి ఆశలను ఆవిరి చేస్తారా.? అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి మాత్రం రాష్ట్ర రాజకీయం జైలు గోడ మీద పిల్లిలా ఉందనే చెప్పాలి.ఎవరు గెలిచినా, ఓడినా ఈ ఓట్ల ' యుద్ధం మాత్రం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఒక ప్రత్యేక చర్చకు దారితీస్తోంది.ఏక్ దిన్ కా సుల్తాన్ ఓటరు మనసెటో మరీ...

## క్యాన్సర్ పై రుయా హాస్పిటల్‌లో
# అవగాహన కార్యక్రమం

**- సూపరింటెండెంట్ డా ప్రమీలదేవి**



**తిరుపతి (ప్రశ్న న్యూస్)** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా డా. ప్రమీలదేవీ సూపరింటెండెంట్ అధ్యక్షతన , డా రామనారాయణ రెడ్డి సివిల్ సర్జన్ ఆర్ ఎమ్ ఓ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం హాస్పిటల్ లో నిర్వహించారు ఈ సందర్భంగా డా. ప్రమీలదేవీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఈరోజు క్యాన్సర్ గురించి అవగాహన పెంచడం తో పాటు, క్యాన్సర్ వ్యాధి గురించి సమాచారాన్ని ప్రజలందరికి తెలిసేలా చేయడం, క్యాన్సర్ తో పోరాడటానికి ప్రపంచ వ్యాప్తంగా బలోపేతం చేసేందుకు ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుదని, క్యాన్సర్ తో బాధపడే వారికీ మద్దతుఇవ్వడం, వారి పట్లసానుభూతి చూపడానికి కూడా ఈ దినోత్సవశీ ఒక సందర్భం అని తెలిపారు. క్యాన్సర్ రావడానికి ముఖ్యంగా జన్యు మార్పులు –వా రసత్వంగా వచ్చే బ్లడ్ కాన్సర్స్, పొగాకు, మద్యం సేవించుట వలన వచ్చే నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరి తిత్తుల క్యాన్సర్, లివర్ కాన్సర్స్, ప్రేవులక్యాన్సర్, అతినీలలోహిత కిరణాలు వలన చర్మ క్యాన్సర్, హ్యూమన్ పాపిలోమా వైరస్ వలన సర్వీక్స్ క్యాన్సర్ మరియు హెపటైటిస్ ఇన్ఫెక్షన్లు వలన లివరు క్యాన్సర్, లింఫోనోడ్స్ కాన్సర్స్,అనారోగ్య ఆహారపు అలవాట్లు –ప్రాసెస్డ్ ఫుడ్, రెడ్ మీట్ వలన జీర్ణశయ కాన్సర్స్,పర్యావరణ కారకాలు –కార్బన్ పొడి, హానికర రసాయణాలు వలన, మరియు రొమ్ము కాన్సర్స్, గర్భసంచి ముఖద్వారా కాన్సర్స్, ఓవేరియన్ క్యాన్సర్స్,ప్రొస్టేట్ కాన్సర్స్ వచ్చే అవకాశం ఉన్నందున, క్యాన్సర్ రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని, చికిత్స కంటే నివారణ ముఖ్యమని ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ గంట సేపు నడక సాగించడం, పొగాకు, మద్యం మానివేయుట, వయసుకు తగ్గ బరువును చూచుకొనుట, అధిక బరువు లేకుండా చూచు కొనుట, శాఖాహారం తీసుకొనుట, ఒత్తడిని తగ్గించుటకుధ్యానశీ చేయుట, ప్రతి 3 నెలలుకు ఒక సారి వైద్య పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్, సెల్ఫ్ ఎగ్జామినేషన్ చేసుకొనుటకు వలన కూడా క్యాన్సర్ ను త్వరగాగుర్తించి,చికిత్స చేసుకొనుటకు సులభతరమగును అని తెలియపరిచారు డా రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ తో నే మనశీ క్యాన్సర్ను అధికమించి ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని, ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. త్వరలో ప్రభుత్వము వాక్సిన్ కూడా సప్లై చేస్తుందని, వాక్సిన్ వచ్చిన వెంటనే మహిళలకు వాక్సినేషన్ చేస్తారని తద్వారా సర్వికల్ క్యాన్సర్ ను నివారించ వచ్చుని తెలియ చేశారు .డా. రాధ ప్రొఫెసర్ అఫ్ గైనకాలజీ వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం జరుగుట, ఎక్కువ కాన్పులు ఆగుట వలన కూడా గర్భసయ కాన్సర్స్ వస్తాయని కావున ప్రతి ఆడబిడ్డకు వివాహం 21సశీవత్స రాలు వయసు వచ్చినపుడే పెళ్ళి చేయాలని తల్లులకు తెలియచేశారు డా గాయత్రి శ్రీ ప్రొఫెసర్ అఫ్ గైన కాలజీ వారు మాట్లాడుతూ గర్భం దాల్చిన తరువాత వైద్యులు సలహా సూచనలు లేకుండా స్వంత మందులు వాడి ప్రాణాలకు అపాయము వచ్చే విధంగా చేసుకుంటున్నారని బాధను వెలికి పుచ్చుతూ, ప్రతి గర్భవతి వైద్యులు సలహా మేరకు పరీక్షలు, చికిత్స చేసుకుని తల్లి, బిడ్డ ఆరోగ్యంగా వుండాలని తెలియచేసారు .డా. సునీత అసోసియేట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ ప్రతి మహిళా 35 సం.. దాటిన తరువాత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలని, ఇంటివద్దకు వచ్చే ఆరోగ్యసిబ్బందికి ఏమైనా క్యాన్సర్ లక్షణాలు గడ్డలు వున్నపుడు వెంటనే వారికి తెలియ చేయాలని మరియు వెంటనే ప్రభుత్వప్రసూతి వైద్యశాల, తిరుపతి కి వస్తే అన్ని పరీక్షలు చేస్తామని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు డా. ప్రసన్న టాగూర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు ఈ విధంగా ఉంటాయని ఉన్నట్లుండి రక్తస్రావశీ శరీర అవయవాలు నుండి రావచ్చు, జ్వరం ఎప్పుడూ వస్తూనే ఉంటుందని, వీరేచనాలు అగుట,బరువు తగ్గుట, బలహీనశీగా ఉండుట ఈ లక్షణాలు వున్నపుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలియచేశారు.ఈ కార్యక్రమం లో డా శ్రీనివాసులు జూూా, డా నిర్మలమ్మ లెక్చరర్, కళావతి నర్సింగ్ సూపరింటెండెంట్, శ్రీమతి హారోహ రమ్మ పబ్లిక్ హెల్త్ నర్స్, హెడ్ నర్సస్, ఎడ్యుకేటర్స్,స్టాఫ్ నర్సస్, ఆరోగ్యకార్యకర్తలు, మిడ్–వైవ్స్, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది మహిళలు, గర్భవతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి బాట సభను
# విజయవంతం చేయాలి

**- గుమ్లాపూర్ సీఎం రేవంత్ రెడ్డి సభకు అధికసంఖ్యలో తరలి రావాలి**
**- బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నేత : కొట్టెపల్లి సుధాకర్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** ప్రజా పాలన––ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నిమిత్తం కరీంనగర్ జిల్లాకు రానున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలకాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా సభ్యులు కొట్టెపల్లి సుధాకర్ పిలుపునిచ్చారు.నేడు గురువారం చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ సభ ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని ఆయన పేర్కొన్నారు.

# సమాజ ప్రగతిలో జర్నలిస్టులదే కీలక పాత్ర

**- ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలి**
**- వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదు 8 వరకు గడువు పెంపు**
**- జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల**



**విశాఖ (ప్రశ్న న్యూస్)** సమాజ ప్రగతిలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అటువంటి వారి సేవలను ప్రభుత్వాలు మరింతగా గుర్తించాల్సిన అవసరం ఉందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి( ఎన్ ఎ జె) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు పేర్కొన్నారు. ఈ మేరకు

విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఏపీఎన్జీవో హోం లో వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదులో వీరు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా మరిన్ని ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.. అలాగే చాలా కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ప్రమాద బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని కోరారు.. ఈ పథకం అమలులో ఉంటే జర్నలిస్టులు జీవితాలకు చాలా వరకు భరోసా కలుగుతుందన్నారు.. గతంలో ప్రీమియం రెండు వందలు చెల్లిస్తే దానికి ప్రభుత్వం కొంత మొత్తం జమ చేసేదని,, ఎవరైనా ప్రమాద బారిన పడినప్పటికీ బీమా సొమ్ము అందడం వల్ల వైద్యానికి ఇతర ఖర్చులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. కాబట్టి ఈ పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాల్సిందిగా వీరు కోరారు.. అలాగే పదవి విరమణ చేసిన జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని.. హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాల్సి ఉందన్నారు..

### 8 వరకు సభ్యత్వ నమోదు గడువు పెంపు

ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నట్లు యూనియన్ నాయకులు గంట్ల శ్రీనుబాబు

పి .నారాయణ జి .శ్రీనివాసరావు లు తెలిపారు.. ఇప్పటివరకు సుమారు 300 మందికి పైగా జర్నలిస్టులు నూతన సభ్యత్వము..రెన్యువల్సును

స్వీకరించడం జరిగిందన్నారు. అయితే ఇంకా అనేక మంది జర్నలిస్టులు సభ్యత్వం పొందాల్సి ఉన్నందున ఈ నమోదు ప్రక్రియను ఈనెల 8న సోమవారం వరకు పొడిగించినట్లు వీరు చెప్పారు.. ఆనందపురం పద్మనాభం భీమునిపట్నం తదితర ప్రాంతాల జర్నలిస్టులు సౌకర్యార్థం ఆదివారం ( ఫిబ్రవరి 7)భీమిలిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఏపీ ఎన్జీవో హోం లో ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.. అయితే తర్వాత గడువు పొడిగించే అవకాశం లేదన్నారు. కాబట్టి తక్షణమే అర్హులైన జర్నలిస్టులంతా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి

జి శ్రీనివాసరావు. బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఈరోతి ఈశ్వరరావు కార్యదర్శి కింతాడ మదన్.. మళ్ళ దేవ త్రినాథ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్. బొబ్బర ప్రసాద్. తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

## ఐఎఫ్ఆర్, మిలాన్ దృష్ట్యా 14 నుంచి
# 21 వరకు బోట్ల నిలుపుదల

**- మత్స్యకారులతో అవగాహన సదస్సు నిర్వహించిన అధికారులు**




విశాఖ పట్నం (ప్రశ్న న్యూస్ ) మూలపాలెం ఇండియన్ నేవీ నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ –మిలాన్ కార్యక్రమాల నేపథ్యంలో, మూలపాలెం గ్రామంలో మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులు పలు అంశాలపై మాట్లాడారు. ఫిబ్రవరి 14 నుంచి 21 వరకు నేవీ బోట్లు నిలుపుదల చేసే సముద్ర ప్రాంతాల్లో చేపల వేట చేపట్టకుండా, అలాగే బోట్లు సంచరించకుండా సహకరించాలని మత్స్యకారులకు విజ్ఞప్తి చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా నేవీ సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. బీచ్‌లు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. మత్స్యశాఖ జేడీ పి. లక్ష్మణ రావు, ఎఫ్.డి.ఓ. మురళీ, మెరైన్ పోలీసు బి.కె.వి. ప్రసాద్, శ్రీనివాస్, నేవీ అధికారులు మధుసూదన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో న్యూట్రీషన్
# గార్డెన్లు ఏర్పాటు చేయాలి

**- ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-7 కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి**
**- ఫిబ్రవరి 10వ తేదీలోపు బిల్లుల అప్లోడింగ్ పూర్తి చేయాలి**
**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



నంద్యాల (ప్రశ్న న్యూస్) పిఎం శ్రీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా న్యూట్రీషన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ జి. రాజకుమారి పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో, పిఎం పాఠశాలల్లో 2024––25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫేజ్––1, ఫేజ్––2, ఫేజ్––7 కింద మంజూరైన పనుల పురోగతిపై ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఇంజనీర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు విడుదల చేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ, మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఇంజనీర్లను ఆదేశించారు. ఫేజ్––1 పనులకు సంబంధించి ఇంకా రూ.9.53 లక్షల మేర వ్యయం చేయాల్సి ఉందని, ఆ నిధులతో పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న న్యూట్రీషన్ గార్డెన్లు, మరుగుదొడ్లు, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ హార్వెస్టింగ్) తదితర పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫేజ్––2 కింద మొత్తం 24 పనులకు మంజూరు చేయగా, కెమిస్ట్రీ ల్యాబ్, కంప్యూటర్ రూమ్, లైబ్రరీ, బయాలజీ ల్యాబ్ వంటి సదుపాయాలకు సంబంధించి ఇంకా రూ.2 కోట్ల 30 లక్షల వ్యయం చేయాల్సి ఉందన్నారు. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తైన అనంతరం పాఠశాలకు అవసరమైన ప్రత్యామ్నాయ వసతుల కల్పనకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు ఈ––ఆఫీస్ ద్వారా ఫైల్ సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ జనార్దన్ రెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ నిత్యానంద రాజు, సమగ్ర శిక్ష ఈఈ సంపత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రిని మించిన తనయ ప్రియాంక

**మధురవాడ జోన్ (6వ వార్డు)** విశాఖ జిల్లా(ప్రశ్న న్యూస్) జీవియంసి కార్యాలయం లో కార్పొరేటర్ లతో 2026 బడ్జెట్ సమావేశం నిర్వహించారు.సమావేశం లో బాగంగా 6వ వార్డు కార్పొరేటర్ డా.ముత్తంశెట్టి ప్రియాంక 6వ లో పలు సమస్యలు పరిష్కరించాలని అభివృద్ధి పనులుకు నిధులు మంజూరు చేయాలని విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు కి గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ కేతన్ కి పలు వినతులు సమర్పించారు. సచివాలయం పరిధిలో గల కొమ్మాది గ్రామం దరి యస్సి కాలనీ కి ఆనుకొని ఉన్న సర్వే నెం 159/1 రులో గత 30 సంవత్సరాలు గా పాకలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఇళ్ళు పట్టాలు మంజూరు చేసి ఇళ్ళు నిర్మించాలని వినతి పత్రాలు సమర్పించారు.త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని జీవియంసి మేయర్ తో పాటు మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ స్పందించారు.



ప్రజాప్రశ్న
హైదరాబాద్ గురువారం 5, ఫిబ్రవరి 2026

# కష్టం కార్యకర్తలది.. భోగం నాయకులది

- జీవితాంతం నాయకుల పల్లకి మోతేనా
- డబ్బు ఉన్నోళ్లకే రాజకీయాలా.?
- అందరూ గోడమీద పిల్లిలేనా.?
- పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి మాకు పదవులు ఇవ్వండి
- పార్టీల నాయకుల కంటే ఇండిపెండెంట్ లని గెలిపించుకుంటూనే అభివృద్ధి




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఏ రాజకీయ పార్టీకైనా కార్యకర్తలే వెన్నుముక. పార్టీ అధికారంలోకి రావాలన్నా, పదికాలాల పాటు అధికారాన్ని చలాయించాలన్నా కార్యకర్తలదే ప్రధాన పాత్ర. కానీ పార్టీ గెలుపుకు, అభివృద్ధికి కారణమవుతన్న కార్యకర్త గుర్తింపు లేక ఓడిపోతున్నాడు. కష్టం కార్యకర్తలది, భోగం నాయకులది అన్నట్టు తయారైంది కార్యకర్తల పరిస్థితి.

ఎలాంటి ప్రయోజనం ఆశించకుండా, దూరమయ్యి విలువైన సమయాన్ని వృధా చేసుకుంటూ జెండా పట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ బ్యానర్లు, ఫ్లెకీలు కడుతూ నలుగురిని కూడకట్టుకుని నాయకులను భుజానికి ఎత్తుకుని జై కొడితే, కార్యకర్తలకు మిగులుతున్నది ఏమిటి.? వారికి దక్కుతున్న గౌరవం ఎంత.? అన్ని పార్టీలు కార్యకర్తలను కూరలో కరివేపాకులా వాడుకుని వదిలేస్తున్నాయి. అసలు కార్యకర్త అనే వారు జెండా పట్టుకోకుంటే పార్టీలకు మనుగడ ఎక్కడిది.? పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తూ, పార్టీనే నమ్ముకుని పార్టీ కోసం సర్వస్వం త్యాగం చేసిన ఎందరో కార్యకర్తలకు పార్టీలో గుర్తింపు లేక, ఎప్పటికీ కార్యకర్తగానే మిగిలిపోతూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.



### కార్యకర్తగానే ఉండాలి.. నాయకుడిగా ఎదగనివ్వరు

కార్యకర్తల స్థాయి నుండి కనీసం 5% మంది కూడా నాయకులుగా ఎదగలేకపోతున్నారు. ఇంకెంత కాలం ఈ దౌర్భాగ్యం. కార్యకర్తలారా ఆలోచించండి. డబ్బు, సమయం రెండు వృధా. పార్టీ కార్యకర్తగా ఒక నాయకుడికి సపోర్ట్ చేస్తున్నారు. అనుకోండి ఓకే నోప్రాబ్లమ్, ఒక సారి, రెండోసారి పర్లేదు, మూడోసారి, నాలుగోసారి, ఆ తర్వాత నాయకుని కొడుకులు, కూతుర్ల పోటీలకు సైతం ఆయన కుటుంబాన్ని నెత్తిన పెట్టుంకుంటున్నారు. నీ నాయకుడిని మోయడం వల్ల నీకు ఓరిగిందేమిటి.?ఎ నాయకులు అందరూ కార్యకర్తల భుజాలనే మెట్లుగా మార్చుకుని భోగాలు అనుభవిస్తున్నారు. మరి కార్యకర్తల సంగతి ఏంటి.? సీట్లు, పదవులు అన్నీ నాయకులే తీసుకుంటే కార్యకర్తలు మరి ఎదిగేదెప్పుడు .? తరతరాలు మారినా, కార్యకర్తలుగానే ఉండిపోవాలా.? నాయకుల పల్లకీలు మోస్తూనే ఉండాలా.? ఇంకెప్పుడు ఇస్తారు కార్యకర్తలకు అవకాశాలు.? ఉద్యోగాల వైపు, వ్యాపారాల వైపు వెళితే మీ కుటుంబాలకు కనీస గౌరవ మర్యాదలు దక్కుతాయని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.నాయకులకు వాళ్ల పిల్లలకు జైకొట్టుడు మానుకొని మీ అభివృద్ధికి పాటుపడండి.

### డబ్బు ఉన్నోళ్లకే రాజకీయాలు..

ప్రస్తుత రాజకీయాలు పూర్తిగా భ్రష్టు పట్టిపోయాయి. రాజకీయం అంటే సేవ అనే అర్థం మారిపోయింది. ప్రస్తుతం రాజకీయం అంటే అవినీతి అక్రమాలు చేయడం డబ్బు సంపాదించుకోవడం ఇప్పుడు ఇదే నడుస్తోంది. అవునన్నా కాదన్నా రాజకీయాలు డబ్బు చుట్టూనే తిరుగుతున్నాయి. డబ్బు ఉన్నోళ్ళకే పరిమితమయ్యాయని అంటే అతిశయోక్తి కాదు. డబ్బు లేని సామాన్య కార్యకర్తలు పార్టీనే నమ్ముకుని మోహమాటం, పరువు కోసం పాకుబాడుతూ ఒక్క పార్టీనే అంటి పెట్టుకుని ఉండిపోతే, డబ్బున్న ద్వితీయ శ్రేణి నాయకులు అధికారం ఎక్కడుంటే అక్కడికి చేరి తమ ప్రాబల్యంతో సామాన్య కార్యకర్తలను ఆవేదనకు గురి చేస్తున్నారు. రాజకీయ పార్టీలు మారినంత ఈజీగా కార్యకర్తలు జెండాలు మార్చలేకపోతున్నారు. అధికార పక్షం అయిన ప్రతిపక్ష పార్టీలో ఉన్నా డబ్బులేని సామాన్య కార్యకర్తకు అసలు విలువ లేదు. గుర్తింపు లేదు. అనుభవంలోకి వస్తే తప్ప, యువ కార్యకర్తలకు విషయం బోధపడటం లేదు. అనుభవం అయ్యేలోపు సమయం అంతా వృథా. అలాంటప్పుడు ఓ కార్యకర్త నీకేందుకు ఈ అనవసరపు ఆరాటం కేవలం వృధా ప్రయాసే, పార్టీ కోసం నిరంతరం కష్టపడి ఎలాంటి గుర్తింపు లేక పార్టీలకు దూరంగా ఉంటున్న కార్యకర్తలు ఎందరో పార్టీల కోసం పోరాడినందుకు వేధింపులు, అక్రమ కేసులు, అరెస్టులు, కనీసం ఇప్పటికైనా పురపాలక సంఘం ఎన్నికల సమయంలో ఆయా వార్డులలో పార్టీ కోసం జెండా మోసిన నిజాయితీపరులైన పార్టీ కార్యకర్తలను గుర్తించి వారికి పదవులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా వ్యాపారస్తులను, కాంట్రాక్టర్లులను ఎంత దూరం పెడితే పార్టీలు అంత బాగుంటాయి అనటంలో సందేహం లేదు.

### అందరూ గోడమీద పిల్లిలేనా.?

మొన్నటి వరకు గత బీఆర్ఎస్ పార్టీలో అధికారలో ఉన్న సమయంలో పదవులు అనుభవించిన నాయకులు పార్టీ ఓడిపోయిందని అధికార పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీలోకి సిగ్గులేకుండా గోడ దూకేశారు. దీని కోసం ఈ పార్టీ, ఆ పార్టీ అనే భేధం లేదు, అన్ని పార్టీల్లో ఇదే వరుస, కార్యకర్తలారా, ఓటరు మహాశయులారా ఒక్కసారి ఆలోచన చేయండి. ఆ పార్టీలో సీటు లేని వాళ్ళు ఈ పార్టీలోకి, ఈ పార్టీలో టికెట్టు ఇవ్వకపోతే ఇంకో పార్టీలోకి అసలు ఏ పార్టీలో టికెట్టు వస్తే ఆ పార్టీలోకి నిస్సిగ్గుగా జంపింగ్ చేస్తున్నారు. ఒకపార్టీ టికెట్టు మీద ఓటమిపాలై, గెలిచిన పార్టీలోకి దూకేయటం, అభివృద్ధి కోసం అంటూ మొసలికన్నీరు కార్చటం కామన్ పాయింట్ గా మారిపోయింది. ఇక్కడ ఒక్క విషయం గమనించండి. వీళ్ళందరూ మనకు తెలిసిన, సుపరిచితమైన నాయకులే, ఒక్కరూ కూడా కొత్త నాయకులు ఉండరు. ఎన్నికల్లో నీతి, నిజాయితీ ఉన్న పాత వాళ్ళను కచ్చితంగా గెలిపించాల్సిందే. ఇక పోతే గెలిచి సొంత ప్రయోజనాల కోసం పాకుబాడే నాయకులను సాగనంపి కొత్త చరిత్రకు నాంది పలకాల్సిన సమయం, అవసరం ఓటర్లకు వచ్చింది. ఈ సారి పార్టీలతో, సంబంధం లేకుండా ఎన్నికల్లో నీతి, నిజాయితీ ఉన్న పార్టీ కార్యకర్తలకు అవకాశం ఇచ్చి వాళ్లను కచ్చితంగా గెలిపించాల్సిందే. ఇక పోతే పార్టీలతో సంబంధం లేకుండా నిజాయితీ ఉన్న ఇండిపెండెంట్ నాయకులను ఎన్నుకోవలసిన అవసరం మనపైన ఎంతైనా ఉంది.

## మహిళా అడ్వకేట్ ను దారుణంగా చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలి: అడ్వకేట్ పల్లా రాధికా శర్మ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) చెవెళ్ల ప్రాంతానికి చెందిన యువ మహిళా న్యాయవాది స్వప్నపై జరిగిన దారుణ హత్య సంఘటన తీవ్రంగా కలచివేసిందిని మహిళా కన్వీనర్, విధి ప్రకోష్ట విహెచ్పి లీగల్ సెల్ అడ్వకేట్ పల్లా రాధిక శర్మ అన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన నేరం మాత్రమే కాదని న్యాయ వ్యవస్థపైనే జరిగిన దాడిగా భావించాలన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను పరిరక్షించడం న్యాయవాదులు బాధ్యత అలాంటి బాధ్యత వహించే వ్యక్తిపై ఈవిధమైన హింస జరగడం అత్యంత అమానుషమైన ఘటన పేర్కొన్నారు.ఉజ్వల భవిష్యత్తు కలిగిన ఒక యువ మహిళా న్యాయవాది ఈ విధంగా హత్యకు గురవడం సమాజంలో మహిళల భద్రతపై ఉన్నలోపాలను స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. న్యాయవాదులు తమ విధులను భయభ్రాంతులకు లోనుకాకుండా నిర్వర్తించే పరిస్థితులుఉండాలన్నారు. ఇటువంటి సంఘటనలకు పాల్పడిన వారిపై కఠిన అత్యవసరంగా తీసుకోవాలన్నారు.ఈ దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తూ, విశ్వ హిందూ పరిషత్ మహిళా న్యాయ విభాగంతరఫున ఇటువంటి ఘోర నేరాలకు పాల్పడిన నిందితులకు బెయిల్ మంజూరు చేయరాదని విజ్ఞప్తి చేశారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని, వేగవంతంగా, పారదర్శక దర్యాప్తు జరపాలని,చట్ట ప్రకారం కఠిన శిక్ష విధించాలని అడ్వకేట్ రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు.మృతురాలు స్వప్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి అండగా నిలుస్తామని తెలియజేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని న్యాయవాది పల్లా రాధిక శర్మ విజ్ఞప్తి చేశారు.

## 2.5 కోట్ల ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేసిన కేంద్రం

**- గుర్తింపు మోసాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) గుర్తింపు మోసాలను అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా మరణించిన 2.5 కోట్లకు పైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను డీయాక్టివేట్ చేసినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బుధవారం పార్లమెంటుకు తెలిపారు. ఆధార్ డేటాబేస్ కచ్చితత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఆధార్ సుమారు 134 కోట్ల మంది వినియోగదారులను కలిగి ఉంది. మరణించిన వారి ఆధార్ నంబర్లను దుర్వినియోగం చేసి సంక్షేమ పథకాలను పొందడం, ఇతర మోసాలకు పాల్పడటం వంటివి నిరోధించడానికి ఈ డీయాక్టివేషన్ ప్రక్రియ చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఆధార్ దుర్వినియోగాన్ని తగ్గించడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ అనేక భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారులు తమ బయోమెట్రిక్స్‌ను లాక్/అన్‌లాక్ చేసుకునే సదుపాయం, లావాదేవీల సమయంలో లబ్ధిదారు భౌతికంగా ఉన్నట్లు నిర్ధారించే 'లైవ్‌నెస్ డిటెక్షన్' ఫీచర్‌తో కూడిన ఫేస్ అథెంటికేషన్, ఆధార్ సెక్యూర్ క్యూఆర్ కోడ్, ఆఫ్‌లైన్ ఈ-కేవైసీ వంటివి అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. వినియోగదారుల ప్రధాన బయోమెట్రిక్ సమాచారాన్ని యూఐడీఏఐ ఎవరితోనూ పంచుకోదని, డేటాను ఎన్‌క్రిప్టెడ్ ఫార్మాట్‌లో భద్రపరచడం తప్పనిసరి చేసిందని ఆయన స్పష్టం చేశారు.

# చెత్త కూరగాయలతో కడుపుచిత్తు, కన్నీళ్లతో మంచమెక్కు

- చెత్త కూరగాయలతో "రుచులు చూడతరమా"
- పెంటలోకూరగాయలు, పంట పడ్డుతున్న తాగుబోతులది,
- మార్కెట్లో కాళ్ల కింద నలిగిన కూరగాయలతో నయా ట్రెండింగ్

బోయిన్ పల్లి మార్కెట్లో నిత్యం పదుల సంఖ్యలో గుర్తు తెలియని వ్యక్తులు షాపుల వద్ద,చెత్త కుండీల్లో పారెసిన కూరగాయలు సేకరణ

- మార్కెటింగ్ డిపార్ట్మెంట్ లక్షలు పోసి "సెక్యూరిటీ గార్డ్స్"ని నియమిస్తే,విధులు మరిచి నిధులు వేటలో బిజీ.?

అస్మదియులకు ఇదే అదునుగా మార్కెట్లో చొరపడుతున్నారు

- పెట్టుబడి లేని దందా బాగుందని ఇంటిల్లిపాదీ ఈ పనిలో ఫుల్ బిజీ
- "6"నెలల క్రితం కమిటీ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకున్నారు
- బోయిన్ పల్లి మార్కెట్ కి ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉన్న అన్ని హోటల్స్ నిర్వాహకులు కొనుగోళ్లు
- ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారి పై చర్యలేవీ,

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న మార్కెట్ అధికారులు

- బోయిన్ పల్లి ప్రాంతాల్లో పలు రెస్టారెంట్స్ పై "ఫూడ్ సెఫ్టీ"

దాడులతో నిగ్గు తేల్చిన అధికారులు.కుళ్లిన కూరగాయలతో సమస్యలు.?





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సమాజంలో ప్రజల జీవన విధానంలో మార్పులు చేర్పులు చోటు చేసుకుంటున్నాయి.తినే ఆహారం నుంచి మొదలు పెడితే తాగే నీరు వరకు అంతా కలుషితం.ముఖ్యంగా నగర వాసులు ఇన్ స్టెంట్ భోజనం పై ఎక్కువ మక్కువ చూపుతున్నారు.పెద్ద పెద్ద రెస్టారెంట్స్,రోడ్డు పక్కన ఉన్న చిన్న చిన్న దుకాణాల ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు,హోటళ్లల్స్ రుచి కరమైన కమ్మటి "వెజ్ నాన్ వెజ్"ఆన్ లైన్ లో బుక్ చేసుకుంటూ అలవాటు పడ్డారు.అప్పటి వరకు కమ్మటి రుచితో వాసనతో లొట్టలేసుకుంటూ రెండు ముద్దలు ఎక్కువ ఆరగిస్తూ,కాసేపటికే అనారోగ్యంతో బాధపడుతున్నారు.కారణంకాలం చెల్లిన పదార్థాలు,కుల్లిన కూరగాయలు పరిసరాలు శుభ్రంగా లేకపోవడం పలు కారణాల వల్ల కస్టమర్ కన్నీళ్లు పెట్టుకోక తప్పట్లేదు.సరే ఇదంతా నాణానికి ఒక వైపు,మరో కోణం ఏమిటంటే ఫుడ్ సెఫ్టీ అధికారులు ఎన్నీ సార్లు దాడులు నిర్వహించిన షాపు యజమానుల పై మార్పు రాకపోవడానికి కారణం అధికారులదే!తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తూచేతులు దులుపుకోవడం పరిపాటుగా మారుతుంది. అదె దుకాణాన్ని సీజ్ చేస్తే మరో సారి చేసే అవకాశం ఉండదని భోజన ప్రియులు అభిప్రాయపడుతున్నారు.ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్,సమస్యలకు కేంద్ర బిందువు:డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ ఆసియాలోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్.ప్రతి రోజు ఇరవై తొమ్మిది వేల టన్నుల రకరకాల కూరగాయలు దిగుమతి అవుతున్నాయని,అలాగే అధికారికంగా రెండు వందల పైచిలుకు కమీషన్ ఏజెంట్లు,అనధికారికంగా వంద మంది పై మాటే కూరగాయల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు.ఇంత పెద్ద మార్కెట్లో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి మొదలయ్యే వ్యాపారం, సుమారు మార్కెట్ కి ఖరీదు దారులు,వివిధ రకరకాల వ్యక్తులు,ఇతర రాష్ట్రాల నుంచి (17 రాష్ట్రాలు)వందల సంఖ్యలో భారీ నుంచి అతి భారీ వాహనాలు మార్కెట్ కి తరలిరావడం,ఇరవై ఐదు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.బోయిన్ పల్లి మార్కెట్ కి పక్షానికి సుమారు (35-40 లక్షల రూపాయలు మార్కెటింగ్ ఖజానాలో జమ అవుతుంది అంటే అర్థం చేసుకోవచ్చు) ముప్పై ఐదు లక్షల రూపాయలు రాబడి వస్తుంది.అంటే ఏటా సుమారు పదిహేను కోట్ల రూపాయలు ఆమ్దాన్నీ ఉంది అంటే ఆశ్చర్చ పోవాల్సిన అవసరం లేదు.అయితే ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం "ప్రజా ప్రశ్న"న్యూస్ పేపర్లో "నెటిజన్లు జర భద్రం"కథనం వస్తే అప్పటి సెక్రటరీ,కమిటీ పెద్దలు "తిరుమల గిరి పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకున్నారు.ఆరు నెలల కావస్తున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది అన్నట్లు ఉంది వీరి వ్యవహారం.అప్పటి నుంచి రోడ్డు పైనే కూరగాయలు విక్రయిస్తూ క్యాష్ చేసుకుంటున్నారు.కానీ అప్పటికి ఇప్పటికి చెత్త కుప్పల పై సేకరించిన కూరగాయలు విక్రయించి వారి సంఖ్య గణనీయంగా పెరుగింది, ఇప్పటి వరకు మార్కెట్ వర్గాలు పట్టించుకున్న పాపాన పోలేదు.

### అన్నదాత పంట నూటికి పది శాతం నేలపాలు..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో అన్ని వింతలే!



బాధ్యత లేని కమీషన్ ఏజెంట్,నిర్లక్ష్యపు ధోరణితో వ్యవహరిస్తున్న"హమాలీ". ఎంతో కష్టపడి తన రక్తాన్ని చిందిస్తూ ప్రజల కడుపు నింపడానికి అహర్నిశలు శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోయినా బాధపడిన"రైతన్న"మార్కెట్లో గుమాస్తాలు,హామాలీలు ఖరీదు దారునికి విక్రయించే సమయంలో వారి నిర్లక్ష్యానికి సంచిలో నుంచి ప్రతి సారి పావు కిలో వరకు నేలపాలు అవుతుంది అన్నదాత కష్టం.దీన్నే అదునుగా పెట్టుబడి లేని వ్యాపారస్తులు,పూట గడవకముందే పాకెట్లోవందల రూపాయలు కానొస్తున్నాయి.లాభసాటి వ్యాపారం అని పసిపిల్లలను సైతం దందాలో దింపేస్తున్నా జాదుగాండ్లు.(సందట్లో సడెమియా)తాగుబోతులు, గుర్తు తెలియని వ్యక్తులు మార్కెట్లో ఎంట్రీ ఇచ్చి తనదైనశైలిలో నేల మీద పడి ఉన్న కూరగాయలు,చెత్త కుండీలు వద్ద పారేసిన కూరగాయలు సేకరించి, వాటిని గ్రేడింగ్ చేస్తారు.మరికొన్ని కూరగాయలు తాజాగా కనిపించేలా మార్కెట్లో ఉన్న వాటర్ ట్యాంక్ ల వద్ద శుభ్రం చేసి, బోయిన్ పల్లి మార్కెట్ ముందే విక్రయించడమే కాకుండా "ధర తక్కువ"అంటూ అందిన కాడికి దోచుకుంటున్నారు.ఇదే అదునుగా మంచి పేరు మోసిన హోటల్స్,రెస్టారెంట్స్,కర్రీ పాయింట్స్ సామాన్యులు సైతం పనికి రాని కూరగాయలు కొనుగోలు చేసి వారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు.అలాగే ఉదయం 11:00 గంటలకు ఓ టీం,మరో బ్యాచ్ 2:00 గంటల నుంచి అమ్మకాలు,ఈ వ్యవహారం గత కొన్నేళ్లుగా జరుగుతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

### బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ



డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ సెక్రటరీ ఈ.వేంకటేశాన్ని వివరణ కోరగా బాధ్యతలు చేపట్టి వారం కూడా కాలేదు! అయితే ఇప్పటిదాకా నా దృష్టికి మాత్రం రాలేదు.నేనే స్వయంగా కిందపడిన,చెత్త కుండీలు పై సేకరిస్తున్న కూరగాయలను,ఆ వ్యక్తులనుగమనించి,తిరుమల గిరి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే పనికి రాని (చెడిపోయిన కూరగాయలు)కూరగాయలు చెత్త కుండీల వద్ద సెక్యూరిటీ సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ కి సంబంధం లేని వ్యక్తులు యార్డులో సంచరిస్తే అలాంటి వారి పై కూడా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ సెక్రటరీ ఈ.వేంకటేశం హెచ్చరించారు.అదిగాక త్వరలో మార్కెట్ కమీషన్ ఏజెంట్లు,హమాలీలతో సమావేశం ఏర్పాటు చేసి అన్నదాత సరుకు నేలపాలు కాకుండా వారికి సూచనలు చేస్తామని పేర్కొన్నారు.రేపటి నుంచి బోయిన్ పల్లి మార్కెట్ రోడ్డు పై గుర్తు తెలియని వ్యక్తులు కూరగాయలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588